ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY అన్నమయ్య
జిల్లా వార్తలు



● జగనన్న సామాజిక న్యాయం.. మేడిపండు చందమే... ● పేరుకేనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
● పెత్తనమంతా ఆ సామాజికవర్గానిదే ● ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లో ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం

వారంతా ఉత్సవ విగ్రహాలే...!

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మేడి పండు చూడ మేలిమై ఉండు.. పొట్ట విప్పి చూడ పురుగులుండు.. పిరికివాని మదిన బింకమేలాగురా! విశ్వదాభిరామ వినుర వేమా !! ఈ పద్యం అచ్చుగుద్దినట్లు ముఖ్యమంత్రి జగన్ చెప్పే సామాజిక న్యాయానికి సరిపోతుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల ఏ ఎన్నికల ప్రచార సభలో చూసినా కామన్‌గా చెప్పే పెద్ద డైలాగ్ ఒకటే.. నా ఎస్సీ నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ వర్గాల ప్రజలకు గత ఐదేళ్లలో ఎంతో చేశా. ఎన్నో పదవులు ఇచ్చా.. నామినేటెడ్ పదవుల్లో సగానికి పైగా వాళ్లకే ఇచ్చా.. ఆయా కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశా.. సామాజిక న్యాయాన్ని మాటల్లో కాదు.. చేతల్లో చూపించా.. అయితే జగనన్న పాలనలో జరిగిన సామాజిక న్యాయం ఉత్తుత్తేనని, తమకు పేరుకు పదవులు కట్టబెట్టి.. పెత్తనమంతా.. జగనన్న సామాజికవర్గానికే ఇచ్చారనే ఆగ్రహం ఆయా వర్గాల్లో ఉంది. తమకంటే ఉత్సవ విగ్రహాలే నయమని, పండుగలు, పబ్బాలకు వాటికి కనీసం పూజలైనా చేస్తారని వాపోతున్నారు. తాము కూర్చోవడానికి కనీసం కుర్చీ కూడా వేయలేదనే బాధ ఆయా రిజర్వేషన్ వర్గాల మనసును గుచ్చుతోంది. జిల్లాలో గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో జరిగిన సామాజిక న్యాయం ఏంటో...? పదవులు పొందిన రిజర్వేషన్ వర్గాలు ఏ మేరకు అధికారాన్ని చెలాయిస్తున్నారో.. ఒకసారి పరిశీలిస్తే తెలిసిపోతుంది జగనన్న సామాజిక న్యాయం ఏమిటో.

● మదనపల్లె మున్సిపాలిటీలో కొందరు కౌన్సిలర్లను స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా అనేక ఇబ్బందులకు గురి చేయడంతో పాటు అభివృద్ధి పనులు కేటాయించడం నుంచి వాటిని క్షేత్ర స్థాయిలో చేపట్టడం వరకు అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకుండా ప్రోటోకాల్‌కు విరుద్ధంగా అవమానించారన్న ఆరోపణలు ఉన్నాయి. 6వ వార్డు గొల్లపల్లికి చెందిన కె.ప్రసాద్‌బాబు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానించడంతో పాటు తమ వార్డులో మంజూరైన ఆర్‌వో ప్లాంట్‌ను కూడా రద్దు చేయించారు. దీనిపై ఏడాది పాటు ఎమ్మెల్యేపై ప్రసాద్‌బాబు పెద్ద యుద్ధమే చేశారు.

23వ వార్డు కౌన్సిలర్ ఎస్.ముబీనా మైనార్టీ వర్గం. ఈమె వార్డులో అభివృద్ధి పనులను అడ్డుకున్నారు. రోడ్డు వేసే క్రమంలో మట్టి తీసేసి కాలువలు తవ్వేసి పనులు కొంతకాలం పెండింగ్ పెట్టారు. అప్పటికే ప్రారంభమైన సిమెంటు రోడ్డు పనులు కూడా అర్థాంతరంగా ఆపేశారు. దీనిపై మున్సిపల్ కార్యాలయం ముందు ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన కౌన్సిలర్ ముబీనా ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా ఆందోళన కూడా చేపట్టారు. పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లారు. మరోసారి రోడ్డు ఎక్కితే కేసులు పెడతామని కూడా హెచ్చరించారు. చివరకు ఎంపీ మిథున్‌రెడ్డి జోక్యంతో కేసులు లేకుండా బయటపడ్డారు. ఎస్సీ వర్గానికి చెందిన గాంధీపురం కౌన్సిలర్ రేణుకమ్మ కూడా కొంతకాలం ఇబ్బంది పడ్డారు. తమ వార్డులో రూపాయి పని కూడా జరగలేదని, ప్రజలకు ఏం సమాధానం చెప్పేదని, చాలాసార్లు కౌన్సిల్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా ఎమ్మెల్యే పేరు చెప్పకపోయినా పరోక్షంగా ఎమ్మెల్యేపై తీవ్ర విమర్శలు చేశారు. తర్వాత కొన్ని నెలలకు సర్దుబాటుతో రాజీకి వచ్చారు. తమకు వ్యతిరేకంగా ఉన్న 6, 23 వార్డుల్లో కౌన్సిలర్లకు సమాంతరంగా తమకు కావాల్సిన వారిని షాడో కౌన్సిలర్‌గా నియమించారు. అన్ని అధికారాలను వారు కట్టబెట్టడంతో పాటు మీరు చెప్పిన అధికారులు కూడా ఇన్ డైరెక్ట్‌గా సూచనలు ఇచ్చారనే ఆరోపణలు సొంత పార్టీ నుంచే వినిపించేవి.

● మదనపల్లె మండలం రంగారెడ్డి కాలనీ ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన సర్పంచ్ ఆసియాబేగం, బీసీ వర్గానికి చెందిన చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, బీసీ వర్గానికి చెందిన దుబ్బిగానిపల్లె సర్పంచ్ బుడ్డయ్యలను స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముప్పు తిప్పలు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. వీరిని ప్రోటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించలేదు.

తమ గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించలేదు. తమ ఖాతాల్లోనే ఉన్న పంచాయతీ నిధులను ఖర్చు చేయకుండా అధికారుల చేత పరోక్షంగా అడ్డుకున్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా లీలా మాధవిని నియమించుకుని ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. వారికి చెక్‌పవర్ రద్దు చేయిస్తానంటూ బెదిరించారు. ప్రోటోకాల్ విషయంలో చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, దుబ్బిగానిపల్లె సర్పంచ్ బుడ్డయ్యలు ఎమ్మెల్యేను ఎదిరించారు.

● గుర్రంకొండ మండలంలో తరిగొండ ఎస్సీ సర్పంచ్‌ను డమ్మీగా ఉంచి రెడ్డి సామాజికవర్గానికి చెందిన ఉప సర్పంచ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ సర్పంచ్ కేవలం పదవిలో ఉన్నారు. బీసీ వర్గానికి చెందిన నడిమికండ్రిక సర్పంచ్, రెడ్డి సామాజికవర్గానికి చెందిన వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే పనిచేయాలి.

● పీలేరు మండలం బాలంవారిపల్లె, దొడ్డివారిపల్లె పంచాయతీల సర్పంచ్ పదవులు ఎస్సీ మహిళకు రిజర్వ్ చేశారు. వారిద్దరూ వ్యవసాయ కూలీలు కావడంతో ఆయా పంచాయతీల్లోని రెడ్డి సామాజికవర్గానికి చెందిన అధికార పార్టీ నాయకులు పెత్తనం చేస్తున్నారు. రేగల్లు పంచాయతీ సర్పంచ్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ నేత తన ఇంట్లోని పని మనిషిని సర్పంచ్‌గా చేసి పెత్తనం తాను చెలాయిస్తున్నాడు. వేపులబైలు సర్పంచ్ పదవి బీసీ పురుషులకు రిజర్వు కాగా అక్కడ కూడా రెడ్డి సామాజికవర్గానికి చెందిన అధికార పార్టీ నాయకులే అన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తున్నారు.

● ఓబులవారిపల్లె మండల జడ్పీటీసీ సభ్యుడు పందికాళ్ల లక్ష్మీనరసయ్య ఎస్సీ సామాజికవర్గం. ఇతను పేరుకే ప్రజాప్రతినిధి. పెత్తనం అధికార పార్టీ అగ్రవర్ణ నాయకులదే. ఆదేవిధంగా మండలంలోని పలు ఎస్సీ వర్గానికి చెందిన సర్పంచులు ఉన్న గ్రామాల్లో పెత్తనం అంతా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నాయకులదే అనే విమర్శలు ఉన్నాయి. దీంతో పలువురు సర్పంచులు కనీసం సమావేశాలకు కూడా వెళ్లడం లేదని మండలంలో ఏ నోటా విన్నా ఇదే చర్చ. ఎంపీపీ బీసీ మహిళ అయినా అధికారం మాత్రం రెడ్డి అయిన ఓ మండల స్థాయి నాయకుడిదే. ఆయనకు అనుకూలంగా ఉంటే అడిగినవి అన్నీ చేస్తారు. లేదంటే ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తారని, ఆయనతో సన్నిహితంగా తిరిగే వాళ్లే అనుకుంటూ ఉండడం విశేషం. ఈ నాయకుడి వల్లే ప్రస్తుత రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ముఖ్యమంత్రి జగన్‌కు ఒకప్పటి సన్నిహితుడు ముక్కా రూపానందరెడ్డి సైతం వైసీపీ నుంచి టీడీపీలో చేరారని ప్రచారం ఉంది.

● రైల్వేకోడూరు మండలంలో ఉప మండలాధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజారెడ్డి అంతా తానే అయి నడిపిస్తారనే విమర్శలు ఉన్నాయి. మండల అధ్యక్షురాలు సింగసమల భవాని (ఎస్సీ) మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన దాఖలాలు లేవని పలువురు పేర్కొంటుంటారు. ఆమెకు కనీసం ప్రత్యేక గది కూడా లేదు. మండల పరిషత్ కార్యాలయంలో ఏ సమావేశాలు నిర్వహించినా ఉప మండల అధ్యక్షుడు ధ్వజారెడ్డి నిర్వహిస్తారని పలువురు పేర్కొంటున్నారు.

● రాజంపేట నియోజకవర్గంలోని ఒంటిమిట్టలో మండల అధ్యక్ష పదవిని ఎస్సీ మహిళ లక్ష్మీదేవికి కట్టబెట్టారు. అయినా ఇప్పటి వరకు ఆమెను ఒకరోజు కూడా మండల అధ్యక్ష స్థానంలో కూర్చోనివ్వలేదు. ఆమెకు కనీస గౌరవం ఇవ్వడం లేదని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ఆమె స్థానంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మండల ఉపాధ్యక్షుడు గెడ్డం జనార్ధన్‌రెడ్డి అనధికారికంగా ఎంపీపీగా కొనసాగేవారు. అతను చనిపోయిన తర్వాతే మండలాధ్యక్షురాలు లక్ష్మీదేవిని ఇటీవల జరిగిన మండల సమావేశానికి ఆహ్వానించారు. అంతవరకు ఆమెను మండల కార్యాలయానికి పిలవలేదు.

● తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఎంపీపీలు, సర్పంచులు, జడ్పీటీసీలు కేవలం అలంకారప్రాయంగానే ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. అంతా స్థానికంగా ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు చెప్పినట్లే జరుగుతుందని స్థానికులు బహిరంగంగానే మాట్లాడుకుంటూ ఉంటారు. తమ పరిధిలో చిన్న పని చేసుకోవాలన్నా కుదరదని, అంతా వారు చెప్పినట్లే జరగాల్సి ఉంటుందని అందరూ అంటున్నారు.

● బి.కొత్తకోట మండలంలో ఎంపీపీ లక్ష్మీనరసమ్మ (ఎస్సీ) గత ఏడాది డిసెంబరు 23న ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల ఎదుట కింద కూర్చుని నిరసన తెలిపారు. మండలంలోని గుమ్మసముద్రం ఇంటి పట్టాల విషయంలో ఎంపీపీగా తన మాట సర్వేయర్ వినడం లేదని, బుచ్చిరెడ్డిగారిపల్లె సర్పంచ్ తన పనులు జరగకుండా చేశాడని ఆమె నిరసన తెలిపారు.

● వాల్మీకిపురం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గంగులమ్మ (ఎస్సీ) పేరుకు మాత్రమే. అధికారాలు అన్నీ.. అధికార పార్టీకి చెందిన ఉపసర్పంచ్ కేశవరెడ్డివే. ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో సైతం ఆమెకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు.

ఏదైనా తప్పనిసరి అవసరం అయితేనే ఆమెను పంచాయతీ కార్యాలయానికి పిలిపిస్తారు. లేకుంటే ఉపసర్పంచే అన్నీ నిర్వహిస్తూ ఉంటారు. మండలంలో ఇద్దరు ఎస్సీలు వైస్ ఎంపీపీలుగా ఉన్నా అధికారం మాత్రం వారిది కాదు. మండల అభివృద్ధిలో వారి పాత్ర ఏమీ ఉండదు. కేవలం సమావేశాలకు మాత్రమే వారు పరిమితం.

● పెనగలూరు మండలంలో ఎంపీపీ బీసీ మహిళ. పేరుకే ఎంపీపీ అయినా వైసీపీ నాయకుడు కొండూరు అజయ్‌రెడ్డిదే పెత్తనమంతా. సమావేశాలప్పుడు మాత్రమే ఆమెను పిలిపించి కుర్చీలో పెడతారు. మండ లంలో ఏ పని అయినా ఆయనే చూసుకుంటారు. ఆమె నామమాత్రానికే ఎంపీపీగా ఉంది. కొండూరు పంచాయ తీలో ఎస్టీ మహిళ సర్పంచ్‌గా ఉంది. ఇక్కడ కూడా ఆమె పాత్ర నామమాత్రమే పెత్తనమంతా ఆయనదే. ఇది ఆయన సొంత పంచాయతీ కాబట్టి ఇక చెప్పాల్సిన పని లేదు.

పెనగలూరు పంచాయతీకి ఎస్సీ మహిళ సర్పంచ్‌గా ఉంది. అయితే అగ్ర కులానికి చెందిన ఉప సర్పంచ్ అన్నీ తానై వ్యవహరిస్తుంటాడు. ఈ పరిస్థితి కేవలం ఒకటో..రెండో మండలాలకు కాకుండా దాదాపు జిల్లా అంతా ఇలాగే ఉంది. రిజర్వేషన్ కోటాలో స్థానిక ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారిని చాలాచోట్ల కనీసం మనిషిగా కూడా చూడడం లేదనే విమర్శలు ఉన్నాయి. పేరుకు చెప్పుకోవడానికి మాత్రమే ఈ పదవులు ఉన్నాయని, ఈ పదవి ద్వారా చిన్న పనిని కూడా చేసుకోలేకున్నారనే విమర్శలు జోరుగా ఉన్నాయి.



ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కింద కూర్చుని నిరసన తెలుపుతున్న బి.కొత్తకోట ఎంపీపీ లక్ష్మీనరసమ్మ (ఫైల్)

రూ.4 కోట్లు మోసం చేసిన ఘరానా దొంగ అరెస్టు

పీలేరు, మార్చి 26: ఏడాది కాలంలో రెట్టింపు సొమ్ము చెల్లిస్తామని పీలేరు పట్టణ వాసులకు సుమారు రూ.4 కోట్ల మేర మోసం చేసిన ఘరానా మోసగాడిని పీలేరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి కథనం మేరకు నంద్యాల పట్టణంలో ఉంటున్న కర్నూలు జిల్లా బండి ఆత్మకూరు మండలానికి చెందిన ఇనపరాళ్ల బాలన్న అలియాస్ బాలరాజు (40), ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన ఐజాక్ స్నేహితులు. వీరిద్దరూ తాము విన్ ఇండియా ఆయుర్వేదిక్ కాస్మొటిక్స్ అండ్ జనరల్ స్టోర్స్, మహిమ ఆయుర్వేదం అనే రెండు సంస్థలకు ఎండీలమని 2023 మార్చి నెల నుంచి పీలేరుకు చెందిన పలువురితో పరిచయాలు పెంచుకున్నారు. తమ సంస్థల్లో రూ.లక్ష డిపాజిట్ చేస్తే 20 వారాలకు రూ.1.80 లక్షలు చెల్లిస్తామని నమ్మించి పీలేరుకు చెందిన ఉపాధ్యాయులు మల్లికార్జున, మురళి, ఖాదర్‌వల్లీల తోపాటు వారి బంధువుల వద్ద నుంచి సుమారు రూ.77 లక్షల వరకు డిపాజిట్లు సేకరించారు. అంతేకాకుండా ఇంకో 50 మంది వద్ద నుంచి కూడా మరో రూ.8 కోట్ల వరకు డిపాజిట్లు సేకరించారు. మొదట్లో రూ.4 కోట్ల వరకు చెల్లింపులు చేసిన బాలన్న, ఐజాక్‌లు ఆ తరువాతి కాలంలో చెల్లింపులు చేయకపోవడం, తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకోవడంతో తాము మోసపోయిన సంగతి తెలుసుకున్న డిపాజిటర్లు పోలీసులను ఆశ్రయించారు. ఎక్కువ మొత్తం చెల్లించిన ఉపాధ్యాయుడు ఖాదర్‌వల్లీ ఈనెల 9వ తేదీ పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదుతో విచారణ ప్రారంభించిన పోలీసులు మంగళవారం ఉదయం పీలేరులో అరెస్టు చేశారు. అతడిని విచారించిన తరువాత రూ.35 లక్షల బ్యాంకు ఖాతా, ఒక ఫార్చ్యునర్ కారు, సెల్‌ఫోను, రూ.2 వేల నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. డిపాజిటర్ల నుంచి సేకరించిన సొమ్ముతో బాలన్న, ఐజాక్‌లు స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు, తిరుపతి జిల్లా చంద్రగిరి సమీపంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసినట్లు కనుగొన్నామని వివరించారు. కోర్టు అనుమతితో వాటన్నింటినీ స్వాధీనం చేసుకుని డిపాజిటుదారులకు చెల్లించేందుకు ప్రయత్నిస్తామని, ప్రస్తుతం ఐజాక్ పరారీలో ఉన్నాడని, అతడిని కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. ఈ కేసును త్వరితగతిన విచారించి పురోగతి సాధించిన తనను, పీలేరు ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది రామచంద్ర, విజయ్, జగదీష్‌లను రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా అభినందించారని సీఐ తెలిపారు.



బాలన్న అరెస్టు చూపుతున్న పీలేరు పోలీసులు

జడ్పీ సర్వసభ్య సమావేశం..
30 నిమిషాలే...!

● రాజంపేట ఎమ్మెల్యేగా పోటీచేస్తున్నా : జడ్పీ చైర్మన్
● మంత్రిగా రావాలంటూ వైసీపీ జడ్పీటీసీల భజన
● యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన
● నీటి సమస్యపై చర్చ నామమాత్రమే

కడప(రూరల్), మార్చి 26: దేశవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఆయా పాలకమండళ్లు అధికాలతో నిర్వహించే సమావేశాలలో పార్టీల ప్రస్తావన కానీ, ప్రత్యర్థులపై విమర్శలు చేస్తే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. అయితే జడ్పీ పాలకమండలి తమకు ఎన్నికల కోడ్ వర్తించనట్లుగా వ్యవహరించింది. మంగళవారం నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధికారుల సాక్షిగా అడుగడుగునా కోడ్ ఉల్లంఘన కనిపించింది. జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి సభకు అధ్యక్షత వహించి తాను రాజంపేట(వైసీపీ) ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నానని జిల్లా అధికారులు ఉన్న సమావేశంలో చెప్పారు. సభలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రస్తావన తీసుకొచ్చారు. జడ్పీ చైర్మన్‌గా రెండున్నర సంవత్సరాలు పూర్తి చేశానని ఇకపై ఎమ్మెల్యే హోదాలో ఇక్కడికి వస్తానన్నారు. వైసీపీ జడ్పీటీసీలు నీవు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా జడ్పీ వేదికపై కూర్చుంటావని చైర్మన్‌కు భజనచేశారు. కాగా.. జడ్పీ సర్వసభ్య సమావేశం ఉదయం 9 గంటలకే ప్రారంభం కావాల్సి ఉంది. ఆ మేరకు 17 శాఖల అధికారులంతా హాజర య్యారు. అయితే జడ్పీ చైర్మన్ 10:40 గంట లకు రావడంతో అప్పుడు సమావేశాన్ని ప్రారం భించారు. ఆయన వచ్చిన 30 నిమిషాలకే సర్వసభ్య సమావేశాన్ని ముగిం చేశారు. కేవలం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖపైనే పేలవంగా చర్చిం చారు. తమ శాఖల చర్చలేనప్పుడు పిలిపించడం ఎందుకంటూ దీంతో ఇతర శాఖల అధికారులు రుసరుసలాడారు.

నీటి సమస్యపై చర్చ ఇలా

జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ మొదలైంది కాబట్టి ఎన్నికల సంఘం అనుమతితో సమావేశం నిర్వహిస్తున్నా మన్నారు. కేవలం తాగునీటి ఎద్దడిపైనే చర్చించాలని చెప్పారు. దీంతో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చర్చకు రాగా అన్నమయ్య జిల్లా ఎస్ఈ మాట్లాడుతుండగా చైర్మన్ కలగజేసుకుని సభ్యులు వారి ప్రాంతాలలో ఉన్న సమస్యలను తెలియజేయాలని సూచించారు. పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల చెన్నయ్య మాట్లాడుతూ 10 పంచాయతీలలో నీటి సమస్య ఉందన్నారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. చక్రాయపేట జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ యర్రగురిపాడు, బాదుగుంటపల్లె, గొంది గ్రామాలలో నీటి సమస్య ఉందన్నారు. వేంపల్లె జడ్పీటీసీ రవిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్టీలు నివసిస్తున్న ఏకలవ్య కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. రామాపురం జడ్పీటీసీ మాట్లాడుతూ నల్లగుట్టపల్లె, క్రాసుపల్లె, సిద్దమల్ల, ఓబులవారిపల్లె, గ్రామాలలో నీటి సమస్య ఉందన్నారు. బద్వేల్ మండల జడ్పీటీసీ మాట్లాడుతూ పుట్టాయపల్లె, చింతలచెరువు గ్రామ పంచాయతీలలో నీటి సమస్య ఉందని ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. కో-ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ ఖాజీపేట మండలంలో నీటిఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. గండికోట నుంచి కడపకు వదులుతున్న నీటిలో కొతమేర ఆదినిమ్మాయపల్లె డ్యామ్ నుంచి 10 రోజుల పాటు మండలానికి తరలించాలని కోరారు.



జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

నీటి సమస్యపై మొక్కుబడి చర్చ

జిల్లాలో కరువు కోరలు విజృంభిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ప్రాజెక్టులు, డ్యామ్‌లలో నీరు డెడ్‌స్టోరేజీకు చేరాయి. నదులు, చెరువులు, వాగులు ఎండిపోయాయి. జిల్లాలో మంచినీటి ఎద్దడి ముంచుకొస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి వైసీపీ ప్రభుత్వం ఆర్‌డబ్ల్యుఎస్ శాఖకు ఒక్క రూపాయి నిధులు విదిల్చలేదు. పంచాయతీ నిధులతో నెట్టుకొస్తున్నారు. ఇలాంటి తరుణంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ నీటి సమస్య పరిష్కారం పేరుతో జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కానీ నీటి సమస్యపై తూతూ మంత్రంగా చర్చించి కేవలం 30 నమిషాలలోనే ముగించారు. కాగా.. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపధ్యంలో జడ్పీ సర్వసభ్య సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరు కాలేదు. ఆయా జడ్పీటీసీలు, ఎంపీపీలు, పలు పాలకమండళ్ల చైర్మన్లు హాజరయ్యారు. అలాగే కలెక్టర్ విజయరామరాజుతో పాటు జేసీ సైతం రాలేదు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి ఉదయం 9 గంటల ప్రాంతంలో జడ్పీకి వచ్చి వెళ్లిపోయారు. ఆయన స్థానంలో డిప్యూటీ సీఈవో రమణారెడ్డి హాజరయ్యారు.

నేడు మదనపల్లెకు చంద్రబాబు రాక

● బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి



మదనపల్లె, మార్చి 26: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం మదనపల్లెకు రానున్నారు. చిత్తూరు జిల్లాలో మూడు రోజుల పర్యటన ముగించుకుని బుధవారం సాయంత్రం మదనపల్లెకు విచ్చేయనున్నారు. ఈ మేరకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో ఆయా పార్టీల శ్రేణులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పుత్తూరు పర్యటన ముగించుకుని సాయంత్రం 4:50 గంటలకు హెలికాప్టర్‌లో స్థానిక బీటీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన కాన్వాయ్‌గా 5 గంటలకు బెంగళూరు బస్టాండు చేరుకుని ప్రజాగళం ఎన్నికల బహిరంగ సమావేశంలో ప్రసంగించనున్నారు. అనంతరం ఇక్కడి నుంచి 7:30 గంటలకు బయలుదేరి రోడ్డుమార్గాన పుంగనూరు రోడ్డులోని శ్రీరామ్‌కాంప్లెక్స్ అతిథి గృహానికి 7:45 గంటలకు చేరుకుంటారు. ఇక్కడ మూడు పార్టీల నేతలు, పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. రాత్రికి అక్కడే బస చేయనున్న అధినేత గురువారం ఉదయం 11 గంటలకు శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లా రాప్తాడుకు బయలుదేరనున్నారు. పట్టణంలోని పర్యటనకు సంబంధించిన హెలిప్యాడ్‌తో పాటు సభాస్థలి బెంగళూరు బస్టాండు, రాత్రికి అధినేత బస చేయనున్న అతిథిగృహాన్ని మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీరాంచినబాబు, మైనార్టీ నేత ఎస్.ఎ.మస్తాన్, రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్ హనుమంతురావుచౌదరి, రాష్ట్రకార్యదర్శి మద్దిపట్ల సూర్యప్రకాశ్, తంబళ్లపల్లె ఎన్నికల ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ ఎన్.విద్యాసాగర్, తదితరులు పరిశీలించారు. అలాగే అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, పట్టణ సీఐలు వలిబసు, యువరాజులు పరిశీలించారు. అంతకుముందు అభ్యర్థి షాజహాన్‌బాషా మదనపల్లెతో పాటు నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో పర్యటించి చంద్రబాబు సభను విజయవంతం చేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులను కోరారు.



బీటీ కళాశాల మైదానంలోని హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న షాజహాన్‌బాషా, శ్రీరాంచినబాబు, తదితరులు

పిల్లల కిడ్నాప్‌కు మహిళ యత్నం..

● దేహశుద్ధి చేసిన స్థానికులు

వాల్మీకిపురం, మార్చి 26: పిల్లలను ఓ మహిళ కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించి పరారైన సంఘటన సోమవారం రాత్రి వాల్మీకిపురం పట్టణంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక నాయక్‌వీధిలోని మసీదు ప్రాంతంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ మహిళ యాచకురాలిగా వచ్చి అన్నం అడిగి పెట్టించుకుని, పక్కనే ఆడుకుంటున్న ఇద్దరు చిన్న పిల్లలను సమీపంలోని రైల్వే ట్రాక్ చీకటి ప్రాంతం గుండా కిడ్నాప్ చేసి తీసుకెళ్లాలని ప్రయత్నించింది. రంజాన్ మాసం కావడంతో అదే ప్రాంతంలో ఉన్న యువకులు, మహిళలు పిల్లల కేకలు విని మహిళను పట్టుకుని వివరాలు ఆరా తీశారు. ఇంతలో ఆ మహిళ ఉడాయించే ప్రయత్నం చేయడంతో స్థానికులు దేహశుద్ధి చేయగా ఆమె అక్కడి నుంచి పరారైంది. పిల్లలను కిడ్నాప్‌కు యత్నించిన మహిళ తన వివరాలను ఒక్కొక్కరి దగ్గర ఒక్కోలాగా చెప్పడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అంతేకాక పిల్లల కిడ్నాప్‌కు యత్నించిన మహిళ స్థానిక రైల్వేస్టేషన్‌లో ఒక్క రోజుకూలి పనులు చేసి కూలి కూడా తీసుకున్నట్లు తెలిసింది. ఏదిఏమైనప్పటికీ పిల్లలు కిడ్నాప్ నుంచి సురక్షితంగా బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై ఎస్ఐ నాగేశ్వర్‌రావును వివరణ కోరగా పిల్లల కిడ్నాప్ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, మండలవ్యాప్తంగా గట్టి నిఘా చేపడతామని, ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.



పిల్లల కిడ్నాప్‌కు ప్రయత్నించిన మహిళ

వ్యాన్ బోల్తా : ఇద్దరు మృతి

అహోబిలం వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం



మృతి చెందిన దేరంగుల ప్రసాద్, సంఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వ్యాన్

సింహాద్రిపురం, మార్చి 26: మండలంలోని గురిజాల గ్రామ సమీపాన మంగళవారం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అహోబిలం పుణ్యక్షేత్రం వెళ్లి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణం కేతిరెడ్డి కాలనీకి చెందిన దేరంగుల ప్రసాద్ (25) అక్కడికక్కడే మృతి చెందగా, దేరంగుల వెంకటమ్మ (83) పులివెందుల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. సింహాద్రిపురం ఎస్ఐ అనిల్‌కుమార్ సమాచారం మేరకు... అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన కొంతమంది కర్నూలు జిల్లా అహోబిళంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని తిరిగి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. అహోబిళం నుంచి సోమవారం తిరుగు ప్రయాణంలో భాగంగా మార్గమధ్యంలో ధర్మవరం చేరుకోగానే రాత్రి అవ్వడంతో సింహాద్రిపురం మండలంలోని అంకాళమ్మ గూడూరు గ్రామం వద్ద వ్యాను ఆపుకుని నిద్రించారు. తిరిగి మంగళవారం ఉదయం ప్రయాణం సాగిస్తుండగా సింహాద్రిపురం-గురిజాల గ్రామాల మధ్య వ్యాన్ అదుపు తప్పి ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ వివరించారు. మృతుడి భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

వేంపల్లె, మార్చి 26: వేంపల్లె పట్టణ గండిరోడ్డులో ఘర్షణ పడి కత్తిపోట్లకు గురైన నరసింహులు (27) అనే వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని సీఐ చాంద్‌బాష తెలిపారు. సీఐ వివరాల మేరకు... మూడు రోజుల క్రితం ఇరువర్గాలు కత్తితో దాడి చేసుకుని నలుగురు గాయపడ్డారు. అసభ్యంగా మాట్లాడుకోవడంతో ఈ ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం అర్ధరాత్రి దాటాక కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నరసింహులు మృతి చెందాడని సీఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడ్డ విద్యార్థులు

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 26: మండలంలోని శెట్టిగుంట పంచాయతీ ప్రధాన రహదారి మారావారిపల్లి వద్ద స్కూటీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు... పోలీసుల వివరాల మేరకు శెట్టిగుంట పంచాయతీ లక్ష్మీగారిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సాహిల్, జస్వంత్ మంగళవారం పదో తరగతి పరీక్షలు రాసి గ్రామానికి వెళ్తుం డగా తిరుపతి నుంచి గిద్దలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన స్థలం వద్ద నిలబడి ఉన్న మరో తొమ్మిదో తరగతి విద్యార్థి మనోజ్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ విద్యార్థులను తిరుపతిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పులివెందులకు నీళ్లిచ్చిన ఘనత టీడీపీదే

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి

చక్రాయపేట, మార్చి 26: పులివెందులకు నీళ్లిచ్చిన ఘనత టీడీపీదేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. మంగళవారం మండలంలోని సిద్దారెడ్డిగారిపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నేత భాస్కర్‌రెడ్డి (ఎల్‌బీఆర్), లోమడ రవీంద్రారెడ్డిల ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ, జగన్ రైతులకు చేసిన అన్యాయంపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో చీనీ చెట్లు ఎండిపోతుంటే రైతులను ఆదుకునేందుకు గత టీడీపీ ప్రభుత్వ పాలనలో నీళ్లు ఇచ్చారన్నారు. 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉండి ప్రజాప్రతినిధులుగా ఉన్న వైఎస్ కుటుంబం రైతులకు నీళ్లు ఇవ్వని పరిస్థితి ఏర్పడిందన్నారు. పులివెందులలోనే ఏమీ చేయలేదని ప్రజలు, రైతులు నిరాశతో ఉన్నారని చెప్పారు. సచివాలయ భవనాలు, వలంటీర్లు నియామకం చేస్తూనే అభివృద్ధి చేసినట్లు కాదని చెప్పారు. నీటి పారుదల వ్యవస్థను, రైతులను కాపాడుకున్నప్పుడే రాష్ట్రం బాగుపడుతుందని చెప్పారు. ఎక్కువగా అరటి, నిమ్మ, చీనీతోటలు సాగులో ఉన్నాయని, అలాంటి ప్రాంతంలో కరువు విలయతాండవం చేస్తుంటే కరువు మండలంగా సీఎం జగన్ ప్రకటించడానికి మనసు రాలేదంటే ఆయనేం ముఖ్యమంత్రి అని ఎద్దేవాచేశారు. సొంత నియోజకవర్గానికి ఏమీ చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నాటి అమర్‌నాథరెడ్డి, కర్నాటి నాగభూషణ్‌రెడ్డి, నియోజకవర్గ జనసేన అధ్యక్షుడు తుపాకుల చంద్ర, పట్టెం అశోక్‌కుమార్, ఎద్దుల చంద్ర, రామాంజనేయరెడ్డి, నరసింహులు, దాసరి ఆంజనేయులు, యోగేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి వేణుగోపాల్

నందలూరు, మార్చి 26: ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ మాఫియాను అరికట్టాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అన్నపూర్ణాంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్‌మోహన్‌రెడ్డి అని విమర్శించారు. మొదట ఓటర్లను మత్తు పదార్థాలకు బానిసగా చేసి ఓట్లు దండుకోవాలని వైసీపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని కాలేజీల్లో డ్రగ్స్ సరఫరా యధేచ్ఛగా జరుగుతోందన్నారు. గంజాయి వినియోగం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఏపీని 12వ స్థానానికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీ హయాంలో ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ నెంబరు-1 స్థానంలో ఉంటే నేడు గంజాయి అక్రమ రవాణాలో నెంబరు-1 స్థానంలో ఉందన్నారు. గతంలో గుజరాత్ ముంద్రా పోర్టులో ఆఫ్ఘనిస్తాన్ నుంచి ఇరాన్ ద్వారా బెజవాడలోని ఓ ట్రేడింగ్ కంపెనీ పేరుతో రవాణా చేస్తున్న 72 వేల కోట్ల హెరాయిన్ పట్టుబడిందని, నేడు బ్రెజిల్ నుంచి వైజాగ్ పోర్టుకు తెచ్చిన 50 వేల కోట్ల డ్రగ్స్ దొరికాయన్నారు. యువత వైసీపీ రొచ్చులో పడకుండా జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విలువైన ఓటు ద్వారా తమ భవిష్యత్తును బంగారుమయంగా చేసుకోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చుక్కా యానాది, జ్యోతి శివ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.91 లక్షలు

సీకేదిన్నె, మార్చి 26: చింతకొమ్మదిన్నె గంగమ్మ గుడి హుండీ ఆదాయం రూ.1,91,650 వచ్చినట్లు ఆలయ ఈవో సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి, మార్చి నెలల ఆదాయాన్ని మంగళవారం భక్తుల సమక్షంలో లెక్కించగా ఆ మొత్తం వచ్చినట్లు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం పేరుతో బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ విశ్వనాథరెడ్డి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, భక్తులు పుల్లయ్య, ఈశ్వర్‌రెడ్డి, యల్లారెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన సింటెక్స్ ట్యాంకు



పేరుకే బోరు ఉందంతే...



సొంతింటి కల నెరవేరేనా..!

- నిలిచిపోయిన జగనన్న కాలనీల గృహాలు
- బిల్లులు అందని దుస్థితి
- నిర్మాణాలకు నీటి వసతి నిల్
- అలంకారప్రాయంగా ట్యాంకు
- పనిచేయని బోర్లు.. ఇబ్బందుల్లో లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు

జమ్మలమడుగు, పొన్నతోట జగనన్న కాలనీ



జమ్మలమడుగు, మార్చి 26: జమ్మలమడుగులో జగనన్న కాలనీల గృహ నిర్మాణాలు నిలిచిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం జమ్మలమడుగు శివార్లలో కొండ ప్రాంతాలకు ఆనుకుని పేదవారికి స్థలాలు ఇచ్చింది. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి ఇస్తుందని పేదలు, సొంతిళ్లు లేనివారు ఆశించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే మొత్తం తక్కువ కావడంతో పేదలు అప్పులు చేసి ఇళ్లు కట్టుకునేందుకు వెనకడుగు వేశారు. చివరకు కాంట్రాక్టర్లకు అప్పగించి ఇళ్లు నిర్మిస్తామని కొందరు వైసీపీ నాయకులు హామీ ఇచ్చారని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఇక తాము త్వరలో సొంతింటికి వెళతామని ఆశించామని.. అయితే కాలనీలో ఇళ్ల పనులు ఆగిపోయాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అలంకారప్రాయంగా మంచినీళ్ల ట్యాంకు

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు ముద్దనూరు రోడ్డులో అంబవరం పాలిటెక్నిక్ కళాశాల వెనుకభాగాన ఇళ్లస్థలాలు ఇచ్చారు. కాంట్రాక్టర్లతో బోర్లు వేయించి సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయించి గృహాలు నిర్మించి ఇస్తామని కొందరు వైసీపీ నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తారు. ఈ మేరకు పేదల నుంచి బిల్లులు తీసుకుని కొంతవరకు నిర్మించి తర్వాత ఇళ్లు కట్టకుండా వదిలేశారని సమాచారం. దీనికితోడు సిమెంటు, కడ్డీలు, తదితర ఇంటి సామాగ్రి తెచ్చే వ్యాపారులక్కు డబ్బులు ఇవ్వకుండా కొందరు ఇబ్బంది కలిగిస్తున్నట్లుగా తెలుస్తోంది. మొత్తం 2,247 ఇళ్లకుగాను 500పైగా వివిధ దశల్లో నిర్మాణాలు చేసినట్లుగా తెలుస్తోంది. జగనన్న కాలనీలో సిమెంటు రోడ్లు లేవు. కొందరు విద్యుత్ మీటర్లకు డబ్బులు చెల్లించినా మీటర్లు ఇంకా ఇవ్వలేదని తెలుస్తోంది. రాత్రి సమయాల్లో కరెంటు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు వాపోతున్నారు.

పొన్నతోట లబ్ధిదారులకు..

జమ్మలమడుగు మండలంలోని పొన్నతోట జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఆర్అండ్ఆర్ కాలనీ శివార్లలో స్థలాలు ఇచ్చారు. ఆ ప్రాంతం చాలా దూరం కావడం, చివరిలో ఉండడం వలన చాలా మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి శ్రద్ధ చూపడం లేదు. అక్కడ 436 మంది లబ్ధిదారులకు స్థలాలు ఇస్తే కేవలం వందమందిలోపే ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. అయితే ఒక్కరు కూడా నివాసం లేరు. కారణం ఆ ప్రాంతంలో తాగునీరు లేదు. సంబంధిత అధికారులకు అనేకసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ఆర్అండ్ఆర్ కాలనీలో మంచినీళ్ల ట్యాంకు అలంకారప్రాయంగా మారింది. దాని పక్కనే ఇనుప పైపులు నిరుపయోగంగా పడవేశారు. కాలనీలో సింటెక్స్ ట్యాంకుల చుట్టూ కంపచెట్లు మొలిచాయి. రోడ్లు లేక మంచినీటిపైపులు పగిలిపోయి నీరు అందక నిర్మాణాలకు నీళ్లు లేక లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్ ఆర్ కాలనీ శివార్ల నుంచి గ్రావెల్ తోలి మంచినీటి పైపులు పగిలిపోయి నీరు అందక ఇబ్బంది పడుతున్నట్లు వాపోతున్నారు. ఒక్క రోజు అయినా ఆ కాలనీలలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేద ప్రజల ఇళ్ల నిర్మాణాలు ఎలా ఉన్నాయని పరిశీలించలేదని ఆ ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారి ఏమన్నారంటే..

ఈ సమస్యలకు సంబంధించి జమ్మలమడుగు హౌసింగ్ ఏఈ ఓబులేసును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఆ కాలనీలో నీరు లేదని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా నిధులు లేక పట్టించుకోవడం లేనట్లుగా ఉందని అన్నారు. మరోవైపు ఇసుక ట్రాక్టర్లు, గ్రావెల్ తరలించే ట్రాక్టర్లు నీళ్ల పైపులపై వెళ్లడంతో పైపులన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు జరగడం లేదని ఆయన తెలిపారు.



ఊడిపోయిన పైపులు

అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తే చర్యలు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మార్చి 26: ఎన్నికల ప్రచారం చేపట్టాలనుకునే వారు ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ముందస్తు అనుమతులు త ప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, నగర కమిషరు ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ఆయా నియోజకవర్గంలోని సంబంధిత రిటర్నింగ్ అధికారుల నుంచి అనుమతులు పొందాలన్నారు. ఒకవేళ అనుమతులు లేకుండా ప్రచారాలు చేస్తే కోడ్ ఉల్లంఘన కింద తప్పనిసరిగా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు హరిప్రసాద్ (టీడీపీ) కానుగ దానం (బీఎస్పీ), జి.లక్ష్మణరావు (బీజేపీ), ప్రసాద్ గౌడ్ (కాంగ్రెస్), చంద్రశేఖర్ (సీపీఎం), మల్లిఖార్జున, శ్రీనివాసులు, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలొద్దు... నిష్పక్షపాతంగా పనిచేయండి

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక ప్రవర్తనా నియమావళి వర్తిస్తుందని ఎవ్వరూ రాజకీయాల జోలికి పోకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరించకూడదని.. రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో పాల్గొనడం, బహుమతులు తీసుకోవడం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. రాజకీయాల్లో ప్రభుత్వ ఉద్యోగి భార్య లేదా భర్త ఉంటే, వారు ఎన్నికలు పూర్తయ్యే వరకు సెలవులు లేదా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి అనుమతి తీసుకోవాలని తెలిపారు.

రూ.19.63 లక్షల నగదు సీజ్

ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై అందిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 215 ఫిర్యాదులు అందగా వాటిలో 209 పరిష్కరించామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన నాటి నుంచి నేటి వరకు పది రోజుల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.19.63 లక్షల నగదుతో పాటు రూ.63.01 లక్షల విలువైన మద్యం సీజ్ చేశామని తెలిపారు. అలాగే 116 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ


- అడ్డుకున్న గ్రామస్తులు
- వాహనాలు సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు





ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద ఇసుకాసురులు చేసిన గుంత, హిటాచీతో ఇసుకను తోడుతున్న దృశ్యం

కడప (క్రైం), మార్చి 26 : ఇసుక అక్రమాలను అడ్డుకోలేకపోతున్నారు. ఇష్టానుసారంగా అడ్డదిడ్డంగా ఇసుకను తోలేస్తున్నారు. క్వారీకి అనుమతులు లేకపోయినా కూడా యథేచ్ఛగా హిటాచీలు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లతో తోలుతున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో అధికారులు అక్రమ రవాణాపై దృష్టి సారించరన్న ఉద్దేశ్యంతో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద రెండు హిటాచీలతో ఇసుకను టిప్పర్లు, ట్రాక్టర్లు ద్వారా రవాణా చేస్తుండడంతో ఆర్పీయం పార్టీ నేత రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అడ్డుకుని కడప ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో వల్లూరు ఆర్ఐ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని టిప్పర్లు, హిటాచీలను అధికారులు సీజ్ చేశారు. అక్కడున్న ట్రాక్టర్లను కూడా సీజ్ చేశారు. దీనిపై రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. టిప్పర్లు, ట్రాక్టర్లతో ఇసుక తోలుతుంటే వాటిని వారం క్రితం అడ్డుకున్నామన్నారు. అనుమతులు ఉన్నాయని చెప్పడంతో ఇసుక రవాణాపై వల్లూరు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అనుమతులు లేకుంటే అడ్డుకుంటామని తహశీల్దార్ చెప్పినా ఇసుక రవాణా ఆగలేదన్నారు. దీంతో మంగళవారం స్థానికులతో కలిసి వాహనాలు అడ్డుకుని ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో రెవెన్యూ అధికారులు వాటిని సీజ్ చేశారని తెలిపారు. ఆదినిమ్మాయపల్లె డ్యాం వద్ద ఆసుక క్వారీలకు అనుమతిలేకపోయినా ఇక్కడ ఇష్టానుసారంగా తోలుతున్నారని అన్నారు.



సెక్యూరిటీ గార్డ్స్ కావలెను

కడపలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q : 5th - 10th P/Fail. డ్యూటీ : 12 గంటలు, జీతం : 12,000/- సంప్ర : 97035 08754, 70950 04007

Ajc-176346

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. నంప్ర: 7382114647

AJA- 176974

కావలెను

శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెని రాజంపేట బ్రాంచ్ నందు పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : 17వేలు + ఇన్సెంటివ్స్ + TA DA లు ఇవ్వబడును. ఏదైనా ఇన్సూరెన్స్ రంగం నందు అనుభవం కలిగిన వారికి ప్రాముఖ్యత ఇవ్వబడును. Cell : 98850 60820

Ajc-188802

WANTED

కడపటౌన్ యస్.బి.ఓ. కాలనీలోని లిటిల్ మాస్టర్స్ ప్లే స్కూల్ (ఎ.సి. క్యాంపస్) నందు పనిచేయుటకు ఇంగ్లీష్ మీడియంలో అనుభవజ్ఞులైన లేడీ ప్రీ ప్రైమరీ టీచర్లు మరియు ఆడ్మిషన్ల చేయుటకు పి.ఆర్.ఓ.లు (F) కావలెయును. సంప్ర: 89199 53765, 90302 11909

Ajc-185421

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మీరు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పండి

- సీఎం జగన్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను ప్రశ్నించిన రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 26: గడిచిన ఐదేళ్లలో రాయచోటి ప్రాంతంలో మీరు చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలను రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో రాంప్రసాద్‌రెడ్డి మీడియాతో మాట్లా డుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నిర్లక్ష్యం కారణంగా విపత్తులతో తెగిపోయిన పింఛా, అన్నమయ్య ప్రాజెక్టులను ఇంతవరకు నిర్మించకుండా గాలికి వదిలేశార న్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం జరిగి ఎంతో మంది నిరాశ్రయులైనా ఇంతవరకు వారికి పునరావాసం కల్పించిన దాఖలాలు లేవన్నారు. రాయచోటిలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పి వైసీపీ నేతలు, కార్యకర్తల రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం ఊరి బయట జనావాసం లేని ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ పనులు చేపట్టి పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే తీరని అన్యాయం చేశారన్నారు. హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా రాయచోటి ప్రాంతంలో వెలిగల్లు, శ్రీనివాసపురం రిజర్వాయర్‌లతో పాటు చెరువులన్నీ నీటిని నింపుతామని చెప్పిన మీరు ఇప్పటి వరకు ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి రాయచోటి పట్టణానికి చుట్టుప్రక్కల మండలాలు కూడా తాగునీరు అందిస్తామని ఇచ్చిన హామీలు అమలయ్యాయో లేదో చెప్పాలన్నారు. ఇలా గడిచిన ఐదేళ్లలో రాయచోటి ప్రాంతంలో ఏం చేశారో చెప్పలేని పరిస్థితిలో ఉన్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు తిరిగి మాకు ఓటు వేయండి అని ప్రజలకు వద్దకు రావడం సిగ్గు చేట న్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు జయరాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, ఖాదర్‌మొహిద్దీన్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రావాలి: రాష్ట్రం బాగుపడాలన్నా, రాయచోటి అభివృద్ధి చెందాలన్నా రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావాలని రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని 22వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన వార్డులో ఇంటింటికి తిరిగి వైసీపీ అరాచకాలను వివరించడంతో పాటు ప్రజల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రం సర్వనాశనం అయ్యిందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగాలన్నా, రాష్ట్రం బాగుపడాలన్నా ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. అలాగే రాయచోటి అసెంబ్లీ, రాజంపేట పార్లమెంట్ స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలిపించు కోవడం ద్వారా అన్ని విధా లుగా అభివృద్ధి జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరెడ్డి కుమారుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి, వీరభద్రస్వామి ఆలయ మాజీ చైర్మన్ ఎద్దుల లక్ష్మిప్రసాద్, టీడీపీ నేతలు సంజీవరెడ్డి, నాగరాజా, రెడ్డిశేఖర్, చిన్న, మహేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నందగోపాల్, ఆనంద్‌నాయుడు, నాగేశ్వర్‌రావు, రాజు, పలువురు నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ముగిసిన నీలకంట్రావుపేట దర్గా ఉరుసు



దర్గాలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రామాపురం, మార్చి 26: మండలంలోని నీలకంట్రావుపేట పంచాయతీ సమీపంలోని శ్రీసాయి నగర్‌లో వెలసిన సమర్థ సద్గురు దర్గా స్వామిజీ ఆశ్రమంలో సద్గురు హజరత్ దర్బార్ అలీషా వలి, రహంతుల్లా అలై బాబా శ్రీజలీల్ మస్తాన్‌అలీ బాబా ఉరుసు ఉత్సవాలు మంగళవారంతో తీర్థప్రసాదాలతో ముగిశాయి. ఉరుసు ఉత్సవాలకు మండల ప్రజలు కాకుండా ఇతర మండలాలు, జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రాత్రి 10 గంటలకు గొప్ప ఖవ్వాలి పోటీ జరిగింది. నాగపూర్‌కు చెందిన నసీంజానీ, కర్ణాటకకు చెందిన సిమ్ ర్యాతాజ్‌ల మధ్య జరిగిన ఖవ్వాలి పోటీలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ ఖవ్వాలి పోటీలకు అధిక సంఖ్యలో హిందూ, ముస్లింలు హాజరయ్యారు. ఉరుసుకు వచ్చిన వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్‌బాబు, రామాపురం ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొక్కు బడులు ఉన్న వారు దర్గా వద్ద తలనీలాలు సమర్పించారు.

వైభవంగా ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

సంబేపల్లె, మార్చి 26: మండలంలోని దుద్యాల గ్రామం వడ్డెపల్లిలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్స వాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమంతో పాటు అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం ప్రదోషకాలు, పూజలు, అభిషేకాలు, దీక్షా హోమాలు, సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీదేవి భూదేవి వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామాలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



చెక్కును అందజేస్తున్న ఈశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

గాలివీడు, మార్చి 26: రామాలయం అభివృద్ధి పనుల కోసం పేరంపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ గీదర ఈశ్వర్ రెడ్డి కుమారులు ధర్మారెడ్డి, నాగ భూషణ్‌రెడ్డిలు రూ.లక్షా 1116 విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును వారు మంగళవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. మండల కేంద్రం గేటు వద్ద గల రామాలయంలో ఇటీవల పలు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం తమవంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు గీదర కుటుం బసభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, ప్రమోద్‌స్వామి, వీరారెడ్డి, సిద్దారెడ్డి, రామ్మూర్తి, ఉమాపతిరెడ్డి, మధు, రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించండి



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

సిద్దవటం, మార్చి 26: మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీ భద్రాద్రి భావ నారాయణస్వామి వీధిలో మంచినీటి సమస్య పరిష్క రించాలంటూ మంగళవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారం రోజుల నుంచి కుళాయిలకు మంచినీళ్ల రావడం లేదని.. తాగునీరు లేకుంటే మేము ఎలా జీవనం సాగించాలని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈవిషయంపై గ్రామ పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనరసయ్య వివరణ కోరగా... ఆ ప్రాంతంలో బోరు రిపేర్‌లో ఉందని.. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామని తెలియజేశారు.

అనుమతి లేని ఇసుక రీచ్‌ను ఆపేయాలి



తహశీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నేతలు

సిద్దవటం, మార్చి 26 : మండల పరిధిలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న జంగాలపల్లె ఇసుక రీచ్‌ను వెంటనే నిలుపుదల చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. టీడీపీ మండల నాయకులు మోహన్‌రెడ్డి, దశరథ రామనాయుడు మంగళవారం తహశీల్దారు మురాద్వావలికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంగాలపల్లె పెన్నానది నుంచి ఇసుక రవాణాకు అనుమతులు లేవని.. ఒంటిమిట్ట మండలం దర్జీపల్లి రీచ్ పేరుతో ఇక్కడ నుంచి ఇసుక రవాణా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మా గ్రామ పంచాయతీ నుంచి ఇసుక తరలిస్తే రాబోయే కాలంలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే చాలా వరకు బోర్లు ఎండిపోయి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేని ఇసుక రీచ్‌లను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

రూ.50 వేలకు మించితే అనుమతి తప్పనిసరి



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు

రాయచోటిటౌన్, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎంసీసీ నిబంధనల మేరకు ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్ల కూడదని ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు హెచ్చరించారు. మంగళవారం రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామం మునసల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో ఈవోఆర్‌డీ ఉషారాణి ఆధ్వర్యంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది పలు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.50వేలకు మించి నగదును తీసుకెళ్లరాదని, ఏదైనా అత్యవసర సమయాల్లో నగదు అవసరమైతే సంబంధిత అధికారుల వద్ద తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కానిస్టేబుల్ కృష్ణకిశోర్, రాంమోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిన్నమండెం, మార్చి 26: మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ కుర్వపల్లె కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు ఆహ్వానం మేరకు విచ్చేసిన టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు గజమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు.

ప్రతిభ చాటిన క్రీడాకారులు



రాజంపేట, మార్చి 26: తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలో జరిగిన 24, 25, 26వ తేదీలలో జాతీయ స్థాయి సిలంబం ఛాంపియన్‌షిప్ (కర్ర సాము)లో ప్రతిభ చాటి పతకాలు సాధించారని మాస్టర్లు రెడ్డి ప్రవీణ్, ఉద్దండపు బాలాజీ గణేష్‌లు మంగళవారం తెలిపారు. నేషనల్ సిలంబం (కర్రసాము) ఛాంపియన్ షిప్‌లో తమ క్రీడాకారులు సురుల్ వాల్ విభాగంలో టి.శివకుమార్ రజత పతకం, వై.గంగాధర్, టి.రేవంత్‌రెడ్డి కాంస్య పతకాలు, ఈటె విభాగంలో కె.ఎల్.భరణి కుమార్ కాంస్య పతకం, కృతిక రెడ్డి రజత పతకం సాధించినట్లు వారు తెలిపారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమని తెలియజేశారు.

ప్రతి ఒక్కరికి ఓటు హక్కుపై అవగాహన అవసరం

రైల్వేకోడూరు(రూరల్) మార్చి 26: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని రైల్వేకోడూరు తహసీల్దార్ శివ రాముడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక హెచ్ఎంఎం హైస్కూల్‌లో భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్‌వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని.. మన హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఓటు హక్కు గురించి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల మృతిపై సీబీఐ విచారణ చేపట్టాలి

రాయచోటిటౌన్, మార్చి 26: ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో రెండు రోజుల క్రితం జరిగిన చేనేత కార్మికుల మృతిపై సీబీఐ చేత విచారణ చేపట్టి నిజనిజాలను బయటపెట్టాలని బీసీ సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలో మీడియాతో మాట్లాడుతూ కొత్త మాధవరంలో చేనేత కార్మికుల మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు. వారిది ఆత్మహత్య లేక హత్యానా అనే విషయంపై ప్రజల్లో పలు రకాలుగా అనుమానాలు ఉన్నాయన్నారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలపై జరిగిన దాడులపై కూడా సీబీఐ విచారణ చేపట్టలని డిమాండ్ చేశారు.

ఏ పార్టీకి కోవర్టును కాదు

- జనసేన పార్టీ రైల్వేకోడూరు అభ్యర్థి డాక్టర్ భాస్కర్‌రావు



పుల్లంపేటలో జనసైనికులతో పార్టీ అభ్యర్థి భాస్కర్‌రావు

పుల్లంపేట, మార్చి 26: జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకొని మొదటిసారిగా రాజకీయ క్షేత్రంలోకి అడుగు పెట్టానని.. తాను ఏ పార్టీకి కోవర్టును కాదని రైల్వే కోడూరు జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పుల్లంపేటలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి జన సైనికులతో మాట్లాడారు. రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని కలిసి రాజకీయ చర్చలు జరిపామని.. అందరితో కలిసి ముందుకు వెళ్లి విజయం సాధిస్తామన్నారు. రైల్వేకోడూ రులోని ప్రతి మండలాన్ని పారిశ్రామిక కేంద్రంగా మారుస్తానని... విద్యార్థుల కోసం నూతన టెక్నికల్ కళాశాలలను ఏర్పాటు చేసి ప్రతి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంధంశెట్టి దినకర్‌బాబు, వర్ధన్నగారి ప్రసాద్, యనమల ప్రసాద్‌బాబు, మహేష్, బాషా నరేష్, వెంకటాద్రి, నాగిసేని వెంకటేష్, పసుపులేటి రవి, వెంకటసాయి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 2 లక్షల బీమా అందజేత



మృతి చెందిన కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాస్

పుల్లంపేట, మార్చి 26: పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ఖాతా ఉండి ఇటీవల మృతి చెందిన ఇండ్లూరు వెంకటసుబ్బమ్మ కుటుంబానికి బ్యాంకు మేనేజరు మూరి శ్రీనివాస్ రెండు లక్షల రూపాయలు బీమా చెక్కును అందజేశారు. చెర్లోపల్లెకు చెందిన మృతురాలు వెంకటసుబ్బమ్మ ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పొంది ఉండటంతో కుటుంబానికి బీమా డబ్బులు వచ్చాయన్నారు. బీమా పొందిన విషయం మృతురాలి కుటుంబ సభ్యులకు తెలియకపోయినా.. వారికి విషయం చేరవేసి బీమా చెక్కును అందజేశామన్నారు. 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు వారికి ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా, 18 నుంచి 70 సంవత్సరాల వారికి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాలు బ్యాంకు కల్పిస్తుందన్నారు. దీనివల్ల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఖాతాదారునికి రూ.4 లక్షల బీమా వస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది విజయ్ శశికళ, వెంకట్రావు, జగ్గుబాయి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం



ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంపై వివరిస్తున్న స్వచ్ఛంద ప్రతినిధులు

ఓబులవారిపల్లె, మార్చి 26: మండలంలోని గాదెల కొత్తపల్లి గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై వీబీఎస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులలో ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఎంతో మేలు అని.. తద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. తక్కువ అమౌంట్‌కే బీమా సౌకర్యం ఉంటుందన్నారు. అలాగే ఆడబిడ్డలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలో డబ్బులు దాచడం వల్ల భవిష్యత్తు ప్రయోజనాలు, ప్రధానమంత్రి సురక్ష యోజన వంటి బీమా పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రైవేటు రంగ బ్యాంకు, ఫైనాన్స్ వడ్డీ వ్యాపారుల నుంచి అప్రమత్తంగా ఉండేందుకు రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రతినిధులు రంగనాథ్, శ్రీహరి, ప్రతాప్‌లు తెలిపారు.

ఏఐటీయూసీలో జాతీయ సీఎస్ఈ విభాగం వర్క్‌షాపు

రాజంపేట, మార్చి 26: రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లె అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో డేటా సైన్స్ అండ్ మిషన్ లర్నింగ్ టెక్నాలజీపై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్‌షాపు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎంవీ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం రీసోర్స్ పర్సన్ పి.శ్రీరామ్ మాట్లాడుతూ డేటా సైన్స్ ప్రాథమిక అంశాలు, అప్లికేషన్, ఒక డేటా ఆధారంగా వ్యాపారానికి సంబంధించి ప్రజెంటేషన్ స్కిల్స్, ప్రోగ్రామింగ్ స్కిల్స్ ఎలా అభివృద్ధి చేసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుబ్బారావు, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భూపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నైపుణ్యత పెంపొందించుకోవాలి: అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం అధ్వర్యంలో మంగళవారం గెస్ట్ లెక్చరర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిజైన్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ సోలార్ థర్మల్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌పై గెస్ట్ లెక్చరర్‌గా డాక్టర్ వై.భరత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈఈఈ విభాగంలో నైపుణ్యత పెంపొందించుకుంటే ప్రపంచంలో ఎలక్ట్రానిక్ విభాగంలో మంచి గుర్తింపు పొందవచ్చునన్నారు. ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ పద్మలలిత మాట్లాడారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd.Rajampet Branch, Rajampet Post & Mandal, Annamaiah Dist. A.P. I hereby given the public notice that **Smt. Varadaraju Subbalakshumma W/o Thirumala Raju,** D.No. 4/28, Mulakkayalapalle Village H/o Mannur, Peddaka-rampalle Post, Rajampet, Mandal, Annamaiah Dist. A.P. applied for a loan from my clients Finance Ltd., by mortgaging the schedule mentioned property which stands in his name. If anybody has got any objections with regard to the schedule mentioned property, file their objections before my clients Office or in my Office within 10 days of this publication, failing which loan will be sanctioned and issued to the applicant. **SCHEDULE:** The property is situated at Kadapa District, presently Annamaiah Dt., Rajampet Sub-Dist., Peddakarampalle Grama Panchayath, Mulakkayalapalle Area, Mannur Grama Polam, Survey No. 1668 an extent of 0.02 Chadarapu Links or (0.011 Hts) with a residential house bearing D.No. 4/49 **Boundaries :** East : Site of Patta Lakshmipathi Govnindaraju, West : Site of Varadaraju Narayana Raju, North : Site of Patta Lakshmipathi Govnindaraju,South: Road, **Measurements of the site :** East to West : Northern Side : 21 Feet or 6.380 Mtrs., Southern Side : 21 Feet (6.38 Mtrs.) North to South - Eastern Side : 51 feet or 16.41 Mtrs. Western Side : 51 feet or 16.41 Mtrs. Total an extent of 126 Chadarapu Gajamulu

S. KRISHNA KUMAR, M.A., B.L.
S. GIREESH KUMAR, M.Tech. LLM
Advocates, Rajampet

ఘనంగా ముగిసిన మల్లూరమ్మ జాతర

ఆకట్టుకున్న చాందినీ బండ్ల ప్రదర్శన



చాందినీ బండ్లు ఎదుట బ్యాండు మేళాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్

చిన్నమండెం, మార్చి 26: మండలంలోని కొత్తపల్లి మల్లూరు గ్రామ పంచాయతీలో మాండవ్యనది ఒడ్డున వెలిసిన మల్లూరమ్మ జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా ముగిసింది. అన్నమయ్య జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున మల్లూరమ్మ జాతరకు తరలి వచ్చారు. సోమవారం సాయంత్రం అమ్మవారు ఆలయం చేరుకున్నప్పటి నుంచి జాతర కార్యక్రమం ప్రారంభమైంది. దాదాపు మొక్కుబడుల్లో ఉన్న వారు 20 చాందినీ బండ్లు కట్టారు. చాందినీ బండ్ల వద్ద వేషధారణలు, చెక్కభజనలు, కోలాటం, డీజే డాన్సులు, బాణా సంచాలతో చూపర్లను కనువిందు చేశాయి. అర్ధరాత్రి నుంచి చాందినీ బండ్లు గుడి ప్రాంగణానికి చేరుకొని తెల్లవారుజాము వరకు గుడి చుట్టూ తిరిగాయి. అనంతరం అమ్మవారికి బండ్లు కట్టిన వారు బోనాలు సమర్పించి జంతుబలి ఇచ్చారు. దీంతో మంగళవారం సాయంత్రం వరకు పగటి తిరుణాల సాగింది. దాదాపు 100 మంది పోలీసు సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. కాగా, మల్లూరమ్మ జాతర సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో విందు కార్యక్రమాల్లో రాయచోటి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామస్థులు పూలదండలతో, బాణా సంచాలు, డప్పు వాయిద్యాలతో ఘనస్వాగతం పలి కారు. ఆయన వెంట కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమ ప్రదాత చంద్రబాబు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా



కుప్పంలో ఇఫ్తార్ విందులో చంద్రబాబుతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో గాజుల ఖాదర్‌బాషా

రాయచోటిటౌన్, మార్చి 26: ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమ ప్రదాత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా కొనియాడారు. సోమవారం రాత్రి కుప్పంలో ముస్లిం మైనార్టీ నేతలు ఏర్పా టు చేసిన ఇఫ్తార్ విందులో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధితో పాటు సంక్షేమం గురించి ఆలోచించిన ఏకైక నాయకుడు చంద్రబాబునాయుడు మాత్రమే అని.. రాబోయే ఎన్నికల్లో ఆయన ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా ఈసారి ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు లక్ష మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి కావాలని మత గురువు ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో కుప్పం సమన్వయ కమిటీ చైర్మన్ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జి మునిరత్నం, కార్యకర్తల సంక్షేమ నిధి కన్వీనర్ డాక్టర్ సురేశ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి. అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందు బాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

యూనిట్ కార్యాలయం
సర్వే నెం. 137 & 138/3, చిన్నచూచుపల్లె
చెన్నూరు మండలం, కడప.
Cell: 9985411183, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు :
కడప : Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411183 బద్వేలు : 9985921375 కోడూరు : 9985411183.

కష్టపడే వారికే ప్రాధాన్యం

● యూనిట్ ఇన్‌చార్జులతో చంద్రబాబు సమీక్ష



కుప్పం రూరల్, మార్చి 26: కష్టపడే వారికి పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని చంద్రబాబు స్పష్టంచేశారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల యూనిట్ ఇన్‌చార్జులతో మంగళవారం రాత్రి ఆయన పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ, గతం గుర్తు చేసుకుందాం, బాబు రుణం తీర్చుకుందాం వంటి కార్యక్రమాలను గ్రామాల వారీగా ఎలా నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. తక్కువ గ్రాఫ్ ఉన్న బూత్‌లకు సంబంధించి సభ్యులను మందలించారు. సమన్వయం చేసుకోని క్లస్టర్ ఇన్‌చార్జులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ 50 రోజులు కష్టపడి పనిచేసి ప్రతి ఇంటికి వెళ్లి మనం గతంలో చేసిన అభివృద్ధిని, చేయబోయే పనులను, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పుడు ఎవరెంత కష్టపడతారో, రానున్న రోజుల్లో వారికే ప్రాధాన్యం ఉంటుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

వేర్వేరు వాహనాల్లో రూ.7.77లక్షలు స్వాధీనం

గుడిపాల, మార్చి 26: గుడిపాల మండలంలోని తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన ముత్తరాజ్‌కుప్పం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. చెన్నై నుంచి వస్తున్న వాహనంలో రూ.5,76,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. చెన్నై నుంచి కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగల్‌కు వెళ్తున్న మినీ లారీలో బంగాళదుంపల లోడును తనిఖీ చేయగా, ఎటువంటి బిల్లులు లేని నగదును గుర్తించి, సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ ఎత్తిరాజులు, సిబ్బంది పాల్గొన్నారు.

● చిత్తూరు-వేలూరులోని గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద వేలూరు నుంచి నెల్లూరుకు చేపల లోడుతో వెళ్తున్న వాహనంలో రూ.2,01,280 నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, బంగారం, వెండి వస్తువులను తరలిస్తే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎన్నికల ప్రత్యేక అధికారి గణపతి ఉన్నారు. మంగళవారం ఒక్కరోజే రూ.7,77,280 పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు.



మారని రంగు

శ్రీరంగరాజపురం: ఎస్ఆర్‌పురం మండలం పుల్లూరు పంచాయతీలోని తాగునీటి ట్యాంకుకు వైసీపీ రంగులున్నాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా వాటిని మార్చలేదు.



పెనుమూరు: పెనుమూరు మండలం శాతంబాకం సచివాలయ పరిధిలోని చిన్నరాజుపల్లిలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకుకు వైసీపీ రంగులు ఉన్నాయి. వీటిని మార్చకపోవడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం చెబుతున్నాయి.

తిరుమలలో హీరో రామ్‌చరణ్



శ్రీవారి దర్శనార్థం హీరో రామ్‌చరణ్ భార్య ఉపాసన,కుమార్తె క్లీంకారతో కలిసి మంగళవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు. ఫీనిక్స్(శ్రీవేంకటేశ్వర నిలయం) అతిథిగృహానికి రాత్రి 7.30 గంటలకు చేరుకున్న వారికి స్థానిక అభిమానులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. రాంచరణ్ దంపతులు బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

- తిరుమల,ఆంధ్రజ్యోతి

పొలంలో అగ్ని ప్రమాదం: రూ.లక్ష నష్టం

సోమల, మార్చి 26: వల్లిగట్ల సమీపంలో అగ్ని ప్రమాదం జరిగి రూ.లక్ష మేర నష్టం జరిగిందని బాధితుడు ఉలవల శివమణి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం బీడు పొలంలో మంటలు చెలరేగాయి. ఆ మంటలు శివమణి టమోటా పొలం వైపు వ్యాపించి.. టమోటా మొక్కలు, డ్రిప్ పైపులు, పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో రూ.లక్ష వరకు నష్టం జరిగినట్లు బాధితుడు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లె - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

CHANGE OF NAME

I, Thalanki Sai Keerthana D/o T.Chandra Mohan Residing at D.No:11/80, Gamallapalem, East Gudur, Gudur (P&M) - 524101, Tirupati (Dist), A.P. Hence I State That My Name Has Been Changed From Talanki Venkata Sai Keerthana (My Old Name) To Thalanki Sai Keerthana (My New Name).

AJT - 179587

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్. సెటిల్మెంట్ చేయబడును.(రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించండి 7382114647

AJA- 176974

మధువర్షిణి మ్యారేజెస్

■ మధువర్షిణి మ్యారేజెస్, గత 21 సం॥లుగా అన్ని కులముల వారికి 1వ / 2వ పెండ్లి సంబంధములు కుదుర్చుచున్న సంస్థ. సం॥ కోట రవినాయుడు (టీచర్) అన్నవరప్పాడు, 4వ లైను, ఒంగోలు. 9392192193

AJO-183904

క్లాసిఫైడ్స్

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించబడదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

కుప్పంలో మీరే అభ్యర్థులు

● మీరేసే ప్రతి ఓటు ముఖ్యమంత్రికేనన్న చంద్రబాబు

● వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

కుప్పం/వి.కోట, మార్చి 26: 'కుప్పంలో అభ్యర్థి నేను కాదు.. మీరే. మీరేసే ప్రతి ఓటు ముఖ్యమంత్రికే. ఈ విషయాన్ని గుర్తుచేస్తూ ప్రజలకు వివరించండి. తద్వారా లక్ష మెజారిటీ ఖచ్చితంగా దాటుతాం' అని చంద్రబాబు అన్నారు. కుప్పంలోని కేవీఆర్ కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కుప్పం కొత్తపేటకు చెందిన వాసు, నగేష్, భాస్కర్, పార్వతమ్మ, విశ్రాంత పోలీసు అధికారి రాజేంద్రప్రసాద్ వారి అనుచరులతో కలసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రామకుప్పం మండలం నుంచి ముస్లిం మైనారిటీలు టీడీపీలోకి వచ్చారు. శాంతిపురం మండలం నుంచి దుబాయిగౌడు, శ్రీనివాసులు, సీకే వెంకటేష్‌తో పాటు సుమారు 150 మంది టీడీపీలో చేరారు. గుడుపల్లె నుంచీ పెద్ద ఎత్తున పార్టీలో చేరగా.. వీరందరికి చంద్రబాబు పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. నాలుగు మండలాల నుంచి సుమారు వెయ్యి మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. అరాచక వైసీపీని వీడి.. అభివృద్ధి కోసం టీడీపీలో చేరడం ప్రశంసనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని గ్రామాలకు గ్రామాలు తరలివచ్చి భావితరాల కోసం టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివాని శ్రీనివాసులు, కుప్పం టీడీపీ ఇన్‌ఛార్జ్ పీఎస్ మునిరత్నం, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, గాజుల ఖాదర్‌బాషా, మాజీ ఎంపీపీ వెంకటేష్, నేతలు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, గోపినాథ్, ప్రతాప్, దాము, ఉమాపతి, ప్రేమ్ కుమార్, విశ్వనాథనాయుడు, బాబు, ఆనంద రెడ్డి, బేటప్ప నాయుడు, మునిరాజు, చలపతి, ఉయ్యాల జయరామిరెడ్డి, ఉదయ్‌కుమార్, నాగరాజు, కృష్ణానాయక్, ఆంజినేయరెడ్డి, జాకీర్, చాంద్‌బాషా, అన్సర్, మణి, అనసూయ, శ్యామల, చంద్రకళ, వసంతమ్మ, యశోదమ్మ, తిరుమళ్ తదితరులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు టీడీపీలో సమన్వయ లోపం

● స్థానిక నేతలను కలుపుకుపోని థామస్ ● వీకెండ్ ప్రచారాలకే పరిమితం అవుతున్నారని అసంతృప్తి

● వైసీపీలోని వర్గపోరును అనుకూలంగా మలచుకోలేక సతమతం



చిత్తూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జీడీ నెల్లూరు నియోజకవర్గం వైసీపీలో వర్గపోరు తీవ్రస్థాయిలో ఉంది. నారాయణస్వామి తీరు మీద అనేక మండలాల్లోని ఆ పార్టీ నాయకులు రగిలిపోతూ ఉంటారు. బహిరంగంగానే సవాళ్లు ప్రతిసవాళ్లు సాగుతుంటాయి. నారాయణస్వామి మీద ఉన్న వ్యతిరేకతను గుర్తించిన వైసీపీ అధిష్ఠానం, ఆయన కుమార్తె కృపాలక్ష్మిని రంగంలోకి దించింది. కుమార్తెను వెంటబెట్టుకుని ఆయన తిరుగుతూ ఉన్నా పరిస్థితి సద్దుమణగలేదు. ఒకవైపు ప్రభుత్వం మీద అసంతృప్తి, మరోవైపు వైసీపీలో ఉన్న అంతర్గత విభేదాలు ఇంత తీవ్రంగా ఉన్నా దీనిని అనుకూలంగా మలచుకోవడంలో టీడీపీ అభ్యర్థి థామస్ విఫలమయ్యారని అంటున్నారు. ఎన్నికలు దగ్గరపడ్డా ఆయన తగినంత సమయం నియోజకవర్గంలో తిరగడానికి కేటాయించుకోవడం లేదని, శని, ఆది వారాలే ఎక్కువగా కనిపిస్తుంటారని టీడీపీ స్థానిక నాయకులే అసంతృప్తితో ఉన్నారు. అది కూడా దళితవాడలకే ఆయన ప్రచార పర్యటనలు పరిమితం అవుతున్నాయని అంటున్నారు. పర్యటనలకు వచ్చినపుడు కూడా థామస్ స్థానిక నేతలను కలుపుకుని వెళ్లడం లేదని అంటున్నారు. వారు ఫోన్లు చేసినా స్పందించడం లేదని పెదవి విరుస్తున్నారు. ఈ విషయమై ఆయనను అడిగితే, చెన్నై నగరంలో పేరుమోసిన ఫెర్టిలిటీ ఆసుపత్రి అధినేతనైన తన స్థాయి గురించి వివరిస్తుంటారని చెబుతున్నారు. 'రాష్ట్రమంతా నాయకులు సీట్ల కోసం చంద్రబాబు నాయుడు వెంటపడితే, నా దగ్గరకి మాత్రం పది మంది ఎమ్మెల్యేలనూ, ఆరుగురు ఎంపీలనూ పంపించి పార్టీలోకి ఆహ్వానించారు' అని ఆయన తరచూ చేస్తున్న వ్యాఖ్యలు కూడా స్థానిక నాయకులను కలవరపరుస్తున్నాయి. పైగా కాబోయే ఆరోగ్య మంత్రినంటూ ఆయన చెప్పుకుంటున్న వైనం చూసి వారు నివ్వెరపోతున్నారు. థామస్ తీరు చూసి ఓ మహిళా నేత సొంత నియోజకవర్గాన్ని వదిలిపెట్టి చిత్తూరు, కుప్పం నియోజకవర్గాల్లో మహిళలతో కలిసి ప్రచారం చేసుకుంటున్నారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ కోసం కృషి చేసిన మరో నాయకుడు కూడా థామస్ తీరుతో అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. పెనుమూరు మండలానికి చెందిన ఓ సీనియర్ నేత, ఎందుకొచ్చిన తంటా అని బెంగళూరుకే పరిమితమైపోయినట్లు సమాచారం. ఇటీవల టీడీపీలో చేరిన ఒక మహిళా నాయకురాలు తలపెట్టిన ఆత్మీయుల సమావేశాన్ని కూడా రద్దు చేయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా థామస్ తీరు నచ్చక ఇటీవల నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, కీలక నాయకులు 15 మంది కలిసి చిత్తూరులోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. తమ అసంతృప్తిని వెళ్లగక్కారు. థామస్ వ్యవహారశైలి మార్చుకోకపోతే నియోజకవర్గంలో మొదటికే మోసం వస్తుందని పార్టీ నాయకులు ఆందోళన చెందుతున్నారు.

2, 3 తేదీల్లో పుంగనూరు గంగజాతర

తొలిచాటింపు వేసిన తోటికులస్తులు





సుగుటూరు గంగమ్మ - జాతర నిర్వహణపై చర్చిస్తున్న జమిందారీ కుటుంబీకులు

పుంగనూరు, మార్చి 26: పుంగనూరులో ఏప్రిల్ 2, 3 తేదీల్లో జరిగే సుగుటూరు గంగమ్మ జాతరకు సంబంధించి జమిందారీ కుటుంబీకుల సమక్షంలో తోటికులస్తులు మంగళవారం రాత్రి తొలి చాటింపు వేశారు. స్థానిక నగిరిలోని ప్యాలెస్‌లో జమిందారీ వంశస్తులు సోమశేఖర్‌రాయల్, మల్లికార్జునరాయల్, వీరేంద్రరాయల్‌లు జాతర నిర్వహణపై పట్టణ ప్రముఖులు, పెద్దలు, తోటి, బెస్తకులస్తులు, అధికారులతో చర్చించారు. ఏటా జాతర రోజుకు ముందు వచ్చే మంగళవారం రాత్రి ప్యాలెస్ వద్ద తొలి చాటింపును తోటికులస్తులు వేస్తారు. రెండో చాటింపు ఈనెల 29న, మూడో చాటింపు జాతర జరిగే వచ్చేనెల 2న ఉంటుంది. ఆ రోజున గంగమ్మను ప్యాలెస్ నుంచి బయటకు తెచ్చి తొలిపూజ, భక్తుల దర్శనం, ఊరేగింపు ఉంటుంది. 3న ఊరేగింపు, నిమజ్జనంతో జాతర ముగుస్తుంది. కాగా, జాతర ఏర్పాట్లు, పార్కింగ్, పారిశుధ్యం, తాగునీరు, దుకాణాలు, గొర్రెల సంత తదితర విషయాలపై పుంగనూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. ఆయనవెంట సీఐ రాఘవరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, వారి సిబ్బంది ఉన్నారు.

రూ.10 లక్షలకు మించి జరిగే

లావాదేవీలపై నివేదికలివ్వండి

● బ్యాంకర్లకు కలెక్టర్ సూచన



బ్యాంకర్ల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 26: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి పోలింగ్ జరిగేంతవరకు బ్యాంకుల్లో రూ.10 లక్షలకు పైబడి జరిగే ప్రతి లావాదేవీపై నివేదికలు ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ శ్రీనివాసులుతో కలిసి ఆయన బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అభ్యర్థుల పేరుపై లేదా వారి ఏజెంట్ల పేరుపై ఖాతాలను ప్రారంభించే విషయంలో బ్యాంకర్లు సహకరించాలని చెప్పారు. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారాల నిమిత్తం నగదు బదిలీ చేసే విషయంలో ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకోసం రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. బ్యాంకర్లతో సమన్వయం చేసుకునేందుకు ముడా వైస్ చైర్మన్ విశ్వనాథ్‌ను సమన్వయ అధికారిగా నియమించినట్లు చెప్పారు. ఎక్స్‌పెండిచర్ నిర్వహణ నోడల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎల్డీఎం హరీష్, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

పెయిడ్ న్యూస్‌పై నిశిత పరిశీలన

వివిధ ప్రసార మాధ్యమాలలో ప్రసారమయ్యే పెయిడ్ న్యూస్‌పై నిశిత పరిశీలన చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, ప్రైవేటు ఎఫ్ఎంలలో ప్రసారాల కొరకు కోడ్ వచ్చిన రోజు నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ఎంసీఎంసీ నోడల్ అధికారి నాగేశ్వరరావు, ఐ&పీఆర్ డీడీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దు చేస్తాం : అమర్



టీడీపీ నాయకులతో కలిసి హెలిపాడ్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి26 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టును రద్దు చేస్తామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి తెలిపారు. మంగళవారం పలమనేరు కోర్టు సమీపంలో పలమనేరు బార్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. కక్షిదారులకు సత్వర న్యాయం కోసం అవసరమైతే కోర్టు అప్‌గ్రేడ్ కోసం భవిష్యత్‌లో బార్ అసోసియేషన్ సూచనల మేరకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. బుధవారం జరగనున్న ప్రజాగళం సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే విజన్ ఉన్న చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలన్నారు. తాను పలమనేరు వదలనని, జనం కోసమే పనిచేస్తానని స్పష్టం చేశారు. పలమనేరు బార్ అసోసియేషన్ సభ్యులు కె.లక్ష్మీపతి, జె.సుబ్రహ్మణ్యం, పరమశివప్ప, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాగళం' ఏర్పాట్ల పరిశీలన

టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం పలమనేరులో ప్రారంభించ నున్న ప్రజాగళం కార్యక్రమ ఏర్పాట్లను మంగళవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డి పరిశీలించారు. జవుళి వీధిలో బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక టీడీపీ నాయకులతో కలిసి చర్చించారు. అలాగే పలమనేరు సమీపంలోని సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను కూడా పరిశీలించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి వెంకటేసులు, నియోజకవర్గ పరిశీలకుడు జయప్రకాష్, నాయకులు ఆర్పీసీ కుట్టి, గిరిబాబు, ఖాజాపీర్, నాగరాజు, పెద్దబ్బ, సుబ్బు, మంజునాథ్, జనసేన నాయకులు పూలచైతన్య, హరీష్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్



గుడుపల్లె, మార్చి 26: గుడుపల్లె మండల పరిధిలోని యామగానిపల్లెలో సోమవారం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో వలంటీర్ నాగరాజు పాల్గొన్నట్లు టీడీపీ నేతలు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సీ విజిల్ యాప్‌లోనూ ఈ ఫొటోలు అప్‌లోడ్ చేసి ఫిర్యాదు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : ఇద్దరి అరెస్టు



పట్టుబడిన కర్ణాటక మద్యం

గంగవరం, మార్చి 26: కర్ణాటక మద్యాన్ని కారుతోపాటు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపిన వివరాల మేరకు.. ముందస్తు సమాచారంతో మంగళవారం వేకువజామున గంగవరం మండలంలోని నంగిలి చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. వీరిని చూసి ఓ కారు వేగంగా వెళ్లిపోతుండటంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. తనిఖీలు చేయగా.. కర్ణాటకకు చెందిన 180 ఎంఎల్ 352 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో ఉన్న పూతలపట్టుకు చెందిన పృథ్వీ, విజయ్‌లను అరెస్ట్ చేశారు. సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీలు అభినందించారు.

'సదరం' సర్టిఫికెట్ రద్దు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పుంగనూరు, మార్చి 26: పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో సదరం క్యాంపునకు వచ్చినట్లు, వికలత్వం లేకపోయినా కడప జిల్లావాసి అమరనాథ్‌నాయక్‌కు వికలత్వ సర్టిఫికెట్ మంజూరైన విషయం తెలిసిందే. ఇది సర్టిఫికెట్ రద్దయినట్లు మంగళవారం చిత్తూరు డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 'పుంగనూరు సదరం క్యాంపులో విచిత్రం' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో విచారించి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మానవ తప్పిదం కారణంగానే ఇది జరిగిందని ఆర్థోపెడిక్ డాక్టర్ మధుమోహన్ తెలియజేశారన్నారు. ఈ క్రమంలో సదరం సర్టిఫికెట్ రద్దు చేయాలని అమరనాథ్ కూడా ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం రద్దు చేసి, ఆన్‌లైన్‌లో తొలగించినట్లు వివరించారు.

ఏటీఎంల వద్ద నగదు కాజేస్తున్న మోసగాడి అరెస్టు

పుంగనూరు రూరల్, మార్చి 26: పుంగనూరులోని ఏటీఎం కేంద్రాలకు వచ్చేవారిని మోసం చేసి మూడు నెలలుగా నగదు కాజేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.70 వేలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఎస్‌ఐ రఫీ వివరాలు మీడియాకు తెలిపారు. పలమనేరు మండలం బేరుపల్లె గ్రామం టి.వడ్డూరుకు చెందిన ఎం.చంద్రయ్య కుమారుడు ఎం.దుర్గాప్రసాద్ (26) ఏటీఎంల వద్ద మకాం పెట్టేవాడు. అక్కడికొచ్చే అమాయకులను టార్గెట్ చేసుకుని వారు ఏటీఎంలో డబ్బు డ్రా చేసేటప్పుడు పిన్ నెంబరు గమనించేవాడు. తర్వాత మాయమాటలు చెప్పి వారి వద్ద ఉన్న ఒరిజినల్ ఏటీఎం కార్డును తీసుకుని, తన వద్ద ఉండే డూప్లికేట్ కార్డును ఇచ్చేవాడు. వారు వెళ్లిపోయాక ఏటీఎం నుంచి సంబంధిత వ్యక్తి ఖాతా నుంచి డబ్బులు డ్రా చేసేవాడు. దీనిపై అందిన ఫిర్యాదులతో మంగళవారం స్థానిక తూర్పుమొగసాల వద్ద దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.70 వేలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బయాలజీ పరీక్షకు 557 మంది గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 26: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన బయాలజీ పరీక్షకు 557 మంది గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. 21,667 మంది విద్యార్థులకు గాను 21,040 మంది హాజరు కాగా, 557 మంది గైర్హాజరైనట్లు చెప్పారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 26: సెలవుల్లో జూనియర్ కళాశాలల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని డీవీఈవో సయ్యద్ మౌల మంగళవారం హెచ్చరించారు. జిల్లాలోని కొన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే ఆపకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు నోర్లున్న దూడ



గంగాధరనెల్లూరు, మార్చి 26: గంగాధరనెల్లూరు మండలం బుక్కాపట్నం దళితవాడలోని రైతు జిలేబీకి చెందిన ఓ ఆవు మంగళవారం మధ్యాహ్నం మూడు నోర్లున్న దూడను ఈనింది. తలకు మామూలుగా ఉండే నోరుతో పాటు తల ఎత్తి గొంతువద్ద చూస్తే మరో రెండునోర్లు ఉన్నట్లు రైతు కుటుంబం గుర్తించింది. పలువురు స్థానికులు ఈ వింత దూడను చూసేందుకు వచ్చారు.

అక్రమంగా నిల్వచేసిన ఇసుక సీజ్



అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక

చిత్తూరు, మార్చి 26: చిత్తూరు నగర శివార్లలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను మంగళవారం సీజ్ చేసినట్లు ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు తెలిపారు. చిత్తూరు- పుత్తూరు మార్గంలో నిర్మాణంలోని ఓ కళాశాల భవనం వద్ద ఇసుక అక్రమ నిల్వలు ఉన్నాయని సమాచారం వచ్చిందన్నారు. అక్కడకు వెళ్లి చూడగా పెద్ద ఎత్తున ఇసుక నిల్వచేసి ఉన్నారన్నారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో ఇసుకకు సంబంధించిన వివరాలు అడగ్గా, ఎటువంటి బిల్లులు, అనుమతి పత్రాలు లేవని చెప్పారన్నారు. దీంతో అక్కడున్న 700 టన్నుల ఇసుకను రెవెన్యూ అధికారుల సమక్షంలో సీజ్ చేశామని ఆయన తెలిపారు.

క్రీడా శిక్షణ కేంద్ర స్థలంలో ముళ్లచెట్ల తొలగింపు

బి కొత్తకోట, మార్చి 26: హార్సిలీహిల్స్‌లోని క్రీడా శిక్షణ కేంద్ర స్థలంలోని ముళ్ల పొదలను మంగళవారం ఎక్స్ కవేటర్‌తో తొలగించారు. ఈ స్థలంలో కొంత భాగాన్ని యాత్ర-2 నిర్మాతకు ఇవ్వాలని ప్రభుత్వం భావించినా, అది కార్యరూపం దాల్చలేదు. ఈ శిక్షణ కేంద్రంలో నిర్మాణాల కోసం విడుదలైన రూ. కోటి నిధులను జూలై 17లోగా వినియోగించి నిర్మాణాలు చేపట్టాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావడంతో, సంబంధిత కాంట్రాక్టరు మంగళవారం సాయంత్రం రంగంలోకి దిగాడు. ఈ స్థలంలో వున్న ముళ్లపొదలు, మట్టిదిబ్బలను తొలగించే పనికి ఉపక్రమించాడు. దీంతో ఇక క్రీడా నిర్మాణ పనులు ముమ్మరంగా సాగనున్నట్లు స్పష్టమవుతోంది.

గుర్రంకొండలో పోలీసుల కవాతు



గుర్రంకొండలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గుర్రంకొండ, మార్చి 26: మండల కేంద్రంలో మంగళవారం సీఐ పులి శేఖర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. బలిజగడ్డ, తాళంవీధి, కొత్తపేట, రామాలయం వీధి, బస్టాండులో ఈ కవాతు కొనసాగింది. కార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె టౌన్, మార్చి 26: తన వద్ద అప్పు తీసుకున్న వారు తిరిగి చెల్లించకుండా తిరగబడుతున్నారని ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. మండలంలోని కురవంక పంచాయితీకి చెందిన తిరుపాలమ్మ ఫైనాన్స్ వ్యాపారం చేస్తోంది. అదే ప్రాంతానికి చెందిన స్వరూప, చంద్రమోహన్, అనిల్, క్రిష్టపర్ సంవత్సరం క్రితం ఆమె వద్ద రూ.7లక్షల అప్పుగా తీసుకున్నారు. దీనికి సంబంధించి వడ్డీ, అసలు చెల్లించకపోగా, తన డబ్బు వాపసు ఇవ్వాలని తిరుపాలమ్మ కోరగా తిరగబడ్డారు. దీంతో మనస్తాపం చెందిన తిరుపాలమ్మ సోమవారం అర్ధరాత్రి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుంటుబీకులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేశారు.

ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో నారాయణ తనిఖీ

పెద్దతిప్పసముద్రం మార్చి 26: మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం మండల విద్యాశాఖాధికారి నారాయణ తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. . నాడు-నేడు పనులు పనులు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. పాఠశాలకు అవసరమైన నిధులు వాటి వివరాలపై పాఠశాల కమిటీ సభ్యులతో చర్చించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన విధానాలపై పలు సూచనలు ఇచ్చారు.

భూమి తగాదా కేసులో ఇరువర్గాలపై కేసు నమోదు

బి కొత్తకోట, మార్చి26: మండలంలోని గుమ్మసముద్రం పంచాయతీ కొండకిందపల్లిలో భూమి విషయంలో ఇరువర్గాలు గొడవ పడ్డాయి. మంగళవారం రెడ్డిశేఖర్ ఫిర్యాదు మేరకు ఓ వర్గంపైన, లక్ష్మీనరుసు ఫిర్యాదు మేరకు మరో పైన కేసులు నమోదు చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

జనం బాగుండాలంటే జగన్ దిగిపోవాలి

● తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 26: రాష్ట్రంలో జనం బాగుండాలంటే జగన్ దిగిపోవాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, పెద్దమండ్యం మండలాల క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జులు, పోలింగ్ బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బతికించుకోవాలంటే ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించాలన్నారు. ఒక్క చాన్సు పేరుతో అధికారంలో వచ్చిన జగన్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశాడన్నారు. రాష్ట్రంలోని వనరులను దోపిడీ చేసి అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, ప్రజాస్వామ్యం బతకాలన్నా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై ముమ్మరంగా ప్రచారం నిర్వహించి పోలింగ్ బూత్ పరిధిలో చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ విధ్వంస, అరాచక, అవినీతి పాలనను సాగనంపాల్సిన సమయం వచ్చిందన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, నారాయణస్వామిరెడ్డి, అనందరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రయాదవ్, సంపతికోట సర్పంచ్ రెడ్డెప్ప, పులికల్లు మాజీ సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, కట్టా వెంటరమణనాయుడు, నాయకులు డేరంగుల నారాయణ, మొటుకు శివ, మాధవరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తంబళ్ళపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి

ప్రచార సమన్వయకర్తకు సన్మానం

తంబళ్ళపల్లె నియోజకవర్గ ప్రచార సమన్వయకర్తగా ఎంపికైన సీడ్ మల్లికార్జుననాయుడుని తంబళ్ళపల్లె ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ఘనంగా సన్మానించారు. మదనపల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నేత మల్లికార్జుననాయుడుని తంబళ్ళపల్లె ప్రచార సమన్వయకర్తగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం జయచంద్రారెడ్డితో కలిసి సీడ్ మల్లికార్జుననాయుడు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీలో గ్రూపులు లేవని అంతా ఒకే కుటుంబమన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ జయచంద్రారెడ్డి గెలుపు కోసం అందరం కష్టపడి పనిచేద్దామన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, ఆనందరెడ్డి, నారాయణస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, వైజీ సురేంద్రయాదవ్, రెడ్డెప్పరెడ్డి, ఆనందరెడ్డి, నారాయణస్వామిరెడ్డి తదితరులు మల్లికార్జుననాయుడును సన్మానించారు.

ఎన్నికల ప్రచార వ్యయంపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు అనుసరిస్తున్న ప్రచారాలు, ఖర్చులపై ఫ్లయింగ్‌స్క్వాడ్, వీడియో సర్వైవలైన్స్, స్టాటిస్టికల్ ఎక్స్‌పెండిచర్ టీం సభ్యులు అప్రమత్తంగా ఉండాలని మదనపల్లె రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో నాలుగు బృందాల అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయ నాయకుల కార్యక్రమాలపై నిఘా వుంచాలన్నారు. దీంతో పాటు ఎక్కడైనా రూ. 50 వేల కంటే ఎక్కువగా నగదు దొరికితే సీజ్ చేసి, పంచనామా నిర్వహించి ట్రెజరీలో డిపాజిట్ చేయించాలన్నారు. ఈ నగదును తిరిగి తీసుకోవాలంటే సదరు వ్యక్తి జిల్లా స్థాయి కమిటీకి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జడ్పీ సీఈవో, డ్వామా పీడీ, జిల్లా ఖజానా శాఖ అధికారులు 24 గంటల్లో నిర్ణయం తీసుకుంటారన్నారు. ఎవరివద్ద అయినా రూ.10లక్షల నగదు దొరికితే ఇన్‌కం ట్యాక్స్ అధికారులు విచారణ చేసారన్నారు. రోడ్‌షోలు, బహిరంగ సభల ఖర్చు, ఫ్లెక్సీల ఏర్పాటు ఖర్చులను ఆయా పార్టీల ఖాతాలో వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం సైనికుల్లా పని చేయాలి

పెద్దమండ్యం, జనవరి 9: టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కూటమి నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు సమష్టిగా సైనికుల్లా పని చేయాలని పెద్దమండ్యం మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, సిద్దవరం ప్రసాద్ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం మండలం తురకపల్లిలో మంగళవారం టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశం జరిగింది. ఎన్నికల హామీలు, బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ, ఓటరు వెరిఫికేషన్, సాధికార సారథులు 2024లో జరుగనున్న ఎన్నికలపై సమీక్ష సమావేశం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన బీజేపీ కార్యకర్తలు క్రమ శిక్షణతో ముందుకు సాగాలన్నారు. రాష్ట్రంలో బాబు సీఎం అవుతారని, తంబళ్లపల్లిలో టీడీపీ జనసేన బీజేపీ పార్టీల జెండా ఎగరవేయాలన్నారు. ఎన్నికలలో సమన్వయ కార్యకర్తలు, నాయకులు పార్టీ కార్యక్రమాలకు పూర్తి సమయం కేటాయించాలన్నారు. టీడీపీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్ళే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. టీడీపీ విజయం కోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. నాయకు లు విశ్వనాథ రెడ్డి, సిద్దవరం ప్రసాద్, కాలేషా, ప్రభాకరరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రియాజ్, జనసేన శంకర, గంగాధర, మహేశ్వర, సాంబ, సయ్యద్‌షావలి, ఖాదర్ హుసేన్, మోహనా, శేషాద్రి, మేకల చలపతి టీడీపీ, జనసేన, బీజేపీ మండల సమన్వయ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమన్వయ సమావేశంలో మండల టీడీపీ, జనసేన బీజేపీ నాయకులు

అభిమాని కుటుంబానికి తనూజా రెడ్డి పరామర్శ

కలికిరి, మార్చి 26: పట్టణంలో టీడీపీ అభిమాని మహ్మద్ (65) మంగళ వారం ఆకస్మికంగా మరణించారు. సమాచారం అందుకున్న టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి కిశోర్ కుమార్‌రెడ్డి సతీమణి తనూజా రెడ్డి మహ్మద్ ఇంటికెళ్ళి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, జనసేన అధ్యక్షుడు అస్లాం జమీయత్ ఉలేమా- ఏ-హింద్ జిల్లా కార్యదర్శి ఎన్ఎండీ ముస్తఫా హజరత్, కరీముల్లా హజరత్, అల్లా బక్ష, వైజాగ్ బాషా, లేపాక్షి అస్లాం, జాఫర్, అల్లావుద్దీన్, అఫ్రోజ్, మసూద్, షాహూర్, అన్సర్, మునాఫ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.



మహ్మద్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తనూజా రెడ్డి

డాక్యుమెంట్ దారిపోయినది

ములకలచెరువు మండలం, ములకలచెరువు గ్రామానికి చెందిన బెండల మహేష్, S/o బెండల అంజనేయులు గారి N5598471 నెంబరు గల ఇండియన్ పాస్‌పోర్టు 15-03-24వ తేదీన ములకలచెరువు గ్రామములోని వినాయక నగర్‌లో ఇల్లు, ఇంటి సామాగ్రి ఒక ఇంటి నుండి మరొక ఇంటికి మార్చేటప్పుడు జారవిడుచుకున్నారు. ఎవరికైన ఒరిజినల్ పాస్ట్‌పోర్టు కాపి దొరికినచో 10-1357, MRO & MPDO ఆఫీసు వెనకున్న ఉషశ్రీ ఇండియన్ గ్యాస్ యందు దయతలచి చేరవేయగలరు. లేనిచో మీకు దొరికినట్లయితే ఈక్రింది నెంబరుకు తెలియజేయగలరు.

Cell : 9440148543

ఆర్టీసీ డ్రైవర్లు వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారిరాము

మదనపల్లె అర్బన్, మార్చి 26: ఆర్టీసీ ఉద్యోగులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రజా రవాణా అధికారి రాము సూచించారు.మంగళవారం మదనపల్లె 1, 2 డిపోలను ఆయనతనిఖీ చేశారు. అనంతరం రెండు డిపోల సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం మొదైందని డ్రైవర్లుచ కండక్టర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, నీళ్ల సరఫరా చేయాలని తెలిపారు. డ్రైవర్లుచ మెకానిక్కులు సుహృద్భావ సంబంధాలు ఏర్పరచుకుని అధిక కేఎంపీఎల్ సాధించాలన్నారు. బస్టాండులో ఉన్న ట్రాఫిక్‌సూపర్‌ఊజర్లు ప్రయాణికులు లేని ట్రిప్పులు కేన్సిల్ చేయాలని తెలిపాఉ. ఏపీఎస్ ఆర్టీసీ అంగేనే సురక్షిత ప్రయాణం అని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ పేరును నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో డీఎం వెంకటరమణా రెడ్డిచ అసిస్టెంట్ మేనేజర్లు కరేవతిచ గీత గ్యారేజఖ సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులకు సూచనలిస్తున్న డీపీటీవో రాము



పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ

పెద్దతిప్పసముద్రం మార్చి 26: మండల కేంద్రం లోని ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి పరీక్షలను మదన పల్లె డీవైఈవో శ్రీరాం పురు షోత్తం మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇన్విజిలేటర్‌లు విధులు నిర్వర్తిస్తున్న తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జీవశాస్త్రం పరీక్ష కు 240 మంది విద్యార్థులకు గానూ 226 మంది హాజరయ్యారని తెలిపారు. పరీక్షా కేంద్రా ల్లో మౌలిక వసతులపై ఆయన ఆరా తీశారు. పరీ క్షలు రాస్తున్న విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోని మౌలిక వస తులపై ఇబ్బందులు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖా .దికారి నారాయణ, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి శివ కుమారి, తదితరులు ఉన్నారు.

బి కొత్తకోట: బి కొత్తకోట నగర పంచాయతీలో ఎస్ఎస్‌సీ పరీక్షలు జరుగుతున్న ఏపీ మోడల్‌స్కూల్, జడ్పీహైస్కూల్ బాయ్స్, గర్ల్స్, విధార్థి స్కూల్, చైతన్య స్కూల్ సెంటర్లను జిల్లా డీవైఈవో శ్రీరాం పురుషోత్తం మంగళవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో మౌలికవసతులు, పరీక్షల నిర్వహణ తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల యంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో శ్రీరాం పురుషోత్తం

ఏ పార్టీకి కోవర్టును కాదు

● జనసేన పార్టీ రైల్వేకోడూరు అభ్యర్థి డాక్టర్ భాస్కర్‌రావు

పుల్లంపేట, మార్చి 26: జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకొని మొదటిసారిగా రాజకీయ క్షేత్రంలోకి అడుగు పెట్టానని.. తాను ఏ పార్టీకి కోవర్టును కాదని రైల్వేకోడూరు జనసేన పార్టీ అభ్యర్థి డాక్టర్ యనమల భాస్కర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన పుల్లంపేటలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి జన సైనికులతో మాట్లాడారు. రైల్వేకోడూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని కలిసి రాజకీయ చర్చలు జరిపామని.. అందరితో కలిసి ముందుకు వెళ్లి విజయం సాధిస్తామన్నారు. రైల్వేకోడూరులోని ప్రతి మండలాన్ని పారిశ్రామిక కేంద్రంగా మారుస్తానని... విద్యార్థుల కోసం నూతన టెక్నికల్ కళాశాలలను ఏర్పాటు చేసి ప్రతి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

చంద్రబాబును సీఎం చేస్తేనే రాష్ట్ర అభివృద్ధి

మదనపల్లె టౌన్, మార్చి 26: రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును మళ్లీ సీఎం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం స్థా నిక సుభాష్‌రోడ్డులో షాజహాన్ బాషా నివాసం వద్ద ఏర్పాటు చే సిన టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీకి కంచుకోట లాంటి మదనపల్లె నియోజవర్గంలో మళ్లీ టీడీపీ జెండా పాతేందుకు, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు బుధవారం సాయంత్రం మదనపల్లెకు వస్తున్నారన్నారు. స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద 6గంటల నుంచి నిర్వహించే బహిరంగ సభకు మదనపల్లె నియోజవకర్గంలోని టీడీపీ శ్రేణులు, జనసేన నాయకులు, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్ అభిమానులు, బీజేపీ నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, రైతులు అన్ని విధాల నష్టపోయారన్నారు. వైసీపీ అరాచక పాలన పోవాలంటే ఉమ్మడి కూటమి నాయకులు అందరు కలసికట్టుగా పని చేయాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి చంద్రబాబు సభను విజయవంతం చేయాలన్నారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు మాట్లాడుతూ చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు టీడీపీ కుటుంబ సభ్యులు కృషి చేయాలన్నారు. మూడు మండలాలు, మదనపల్లె పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: ప్రజాగళం సభను విజయవంతం చేయాలని ఉమ్మడి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వారపు సంత సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్న, శ్రీపతి, మల్లప్ప, నరేంద్ర, రామకృష్ణ తదితరుల పాల్గొన్నారు.



నిమ్మనపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి షాజహాన్‌బాషా

చంద్రబాబును కలసిన ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, మార్చి 26: చిత్తూరు జిల్లా కుప్పం పర్యటనలో వున్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ మంగళవారం మర్యాదపూర్వకం గా కలిసారు. ఈ సందర్భంగా మదనపల్లెలో బుధవారం చేపట్టనున్న చంద్రబాబు బహిరంగ సభ గురించి, నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి షాజ హన్‌బాషా గెలుపుకు తామేమి చేస్తున్నామో చంద్రబాబుకు వివరించారు. కంచుకోట లాంటి మదనపల్లెను తిరిగి టీడీపీ కైవసరం చేసుకునేలా కష్టపడాలని చంద్రబాబు సూచించారని వెంకటేశ్ తెలిపారు.



చంద్రబాబును కలసిన టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

టీడీపీ నాయకుల బైండోవర్

మదనపల్లె టౌన్, మార్చి 26: మదనపల్లె మండలానికి చెందిన ఐదుగురు టీడీపీ నాయకులను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. మంగళవారం మదనపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు దేవరింటి శ్రీనివాసులు, చల్లా నరసింహులు, నరసింహులు, రాజు, బాలాజి, శ్రీనివాసులుకు నోటీసులు ఇచ్చిన పోలీసులు మదనపల్లె తహసీల్దార్ ఎదుట హాజరుకావాలని సూచించారు. ఈ క్రమంలో ఐదుగురు టీడీపీ నాయకులు బైండోవర్‌కు హాజరై ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలిగించమనిరాసిచ్చారు.



బైండోవర్ అయిన టీడీపీ నాయకులు

అర్చకుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

మదనపల్లె టౌన్, మార్చి 26: అర్చకుడిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని మదనపల్లె అర్చక, పురోహితుల సంఘం అధ్యక్షుడు శివకుమార్ శర్మ, కార్యదర్శి నాగపద్మ కుమారశర్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శేషమహల్ సమీపం లోని కేహెచ్ ప్రశాంత్ నివాసంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడలో జరిగిన సంఘటన చాలా బాధాకరమన్నారు. నిందితుడు మాజీ కార్పొరేటర్ చంద్రరావుపై కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా కఠినంగా శిక్షించాలన్నారు. అలా చేయని పక్షంలో 175 నియోజకవర్గాల్లోని బ్రాహ్మణులు ఒక నిర్ణయానికి వస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అర్చక సంఘం సభ్యులు రవికుమార్ శర్మ, పవన్‌కుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న మదనపల్లె అర్చక, పురోహితుల సంఘం నాయకులు

న్యాయం కోసం వెళితే పోలీసులు కొట్టారు

మదనపల్లె టౌన్, మార్చి 26: తమ భూమిని ఇతరులు ఆక్రమించారని పోలీసులకు ఫిర్యాదు చేస్తే న్యాయం చేయాల్సిన పోలీసులు తమనే కొట్టారని రైతు సి.ప్రతాప్ ఆరోపించారు. బాధితుడి కథనం మేరకు తన తండ్రి సి. కృష్ణయ్య ఆధీనంలో అంకిశెట్టిపల్లె పంచా యతీ ఖాతా నెంబరు 218కు చెందిన 2.40 ఎకరాల భూమి 20 ఏళ్లుగా ఉంది. ఆయనకు ఆరోగ్యం సరిగ్గా లేక తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, ఆ భూమిని జగన్నాథం, చంద్రకళ, నవీన్ ఆక్రమించుకున్నారు. దీనిపై మదనపల్లె తాలూకా పోలీసులకు డిసెంబరు 11న ఆన్‌లైన్‌లో, తనకు ప్రాణ రక్షణ కల్పించాలని మదనపల్లె డీఎస్పీకి రిజిస్టర్ పోస్టుద్వారా ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఫిబ్రవరి 19న అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేయగా, వారు మదనపల్లె తాలూకా ఎస్ఐ రవికుమార్‌కు విచారణకుఆదేశించారు. కానీ రవికుమార్ తనకు న్యాయం చేయకపోగా, భూమిలోకి వెళ్లిన తన అన్న, చెల్లెలు కోకిలను విచక్షణ రహితంగా కొట్టారన్నారు. ఈ విషయమై సీఐ శేఖర్‌కు సమాచారం అందించి మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చేరామన్నారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై తాలూకా సీఐ శేఖర్‌ను వివరణ కోరగా పోలీసులు బాధితులను కొట్టలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేస్తామని సీఐ చెప్పారు.



మాట్లాడుతున్న బాధితుడు ప్రతాప్

రాష్ట్రంలో జరిగేది ముఖాముఖి పోటీ

● ఏపీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి

కలికిరి, మార్చి 26: రానున్న ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగినట్లు కనిపిస్తున్నా అది కేవలం ముఖాముఖి పోటీనేనని ఏపీసీసీ మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి స్పష్టం చేశారు. పీలేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని ఎన్నికల వైపు సన్నద్ధం చేసే దిశగా కలికిరిలో మంగళవారం జరిగిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీకి కూడా పరోక్షంగా బీజేపీతో పొత్తు ఉందని తెలిపారు. వైసీపీ, టీడీపీ, జనసేన బీజేపీ బానిస పార్టీలని అభివర్ణించారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, వీలైతే ఆమ్ ఆద్మీ పార్టీలు జతకట్టి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాల్లో పోటీచేయనున్నట్లు వెల్లడించారు. షర్మిలా రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ అనూహ్య రీతిలో పుంజుకుందన్నారు. జాతీయ స్థాయిలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప స్టీల్ ప్లాంటు, పోలవరం నిర్మాణం, విశాఖ రైల్వేజోన్‌లు వచ్చే ప్రసక్తే లేదని చెప్పారు. మొన్న కర్నాటక, నిన్న తెలంగాణా, రేపు ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జగన్ అనుకున్న దానికి భిన్నంగా పాలన సంక్షోభంలో పడిందని విమర్శించారు. ఐదేళ్లలో 32 సార్లు బటన్ నొక్కి రూ.లక్షా 89 వేల కోట్లు ప్రజలకు నేరుగా అందించానని గొప్పలు చెప్పుకోవడం వాస్తవం కాదన్నారు. ప్రజలకు చాక్లెట్ ఇచ్చి నెక్లెస్ లాక్కున్న విషయం ప్రజలకు అర్థమైందని, రేపు సిద్ధం సభల్లో ప్రజలు జగన్‌ను నిలదీయనున్నారన్నారు. సమావేశంలో పుంగనూరు, పీలేరు, మదనపల్లె కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమశేఖర్ రెడ్డి, సింగం రామకృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీవర్ధన్, మల్లికార్జున, వేల్పుల శ్రీధర్, బుడ్డా రెడ్డి, మోసీనా, శ్రీకాంత్, రెడ్డి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి


స్వాగతం - సుస్వాగతం
స్వర్ణాంధ్రప్రదేశ్ సృష్టికర్త,
పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి,
మాన్యశ్రీ నారా చంద్రబాబు
నాయుడు గారు
ప్రజా గళం
ఎన్నికల శంఖారావం
పూరించడానికి
నేడు మదనపల్లెకు
విచ్చేయుచున్న
సందర్భంగా వారికివే
మా స్వాగతం
సుస్వాగతం.
ఈ బహిరంగ సభకు
నియోజకవర్గంలోని
తెలుగుదేశం జనసైనికులు,
బిజెపి నాయకులు, కార్యకర్తలు
ఈ సభను జయప్రదం
చేయవలసిందిగా
కోరుచున్నాను.
బహిరంగ సభ ప్రాంగణం
బెంగుళూరు బస్టాండు
మదనపల్లె
తేది : 27-03-2024, బుధవారం
సమయం : సా॥ 5.00 గం॥కు
శ్రీ ఎం. షాజహాన్ బాషా
మదనపల్లె నియోజకవర్గం
తెలుగుదేశం, జనసేన, బిజెపి
ఉమ్మడి అభ్యర్థి
తెలుగుదేశం, జనసేన మరియు బి.జె.పి.
మదనపల్లె నియోజకవర్గం

స్వాగతం - సుస్వాగతం





మదనపల్లిలో జరిగే
ప్రజాగళానికి
విచ్చేయుచున్న
స్వర్ణాంధ్ర రధసారధి
రైతన్నల పెన్నిధి,
అభివృద్ధి ప్రదాత
యువతకు స్ఫూర్తిదాత
మాన్యశ్రీ
నారా చంద్రబాబు నాయుడు గారికి
స్వాగతం - సుస్వాగతం



ఎన్‌డిఏ కూటమి గెలుపు - ఎపిలో అభివృద్ధికి మలుపు



సభాస్థలి
బెంగుళూరు బస్టాండ్,
మదనపల్లి

సమయం:
27-03-2024, బుధవారం
సాయంత్రం 5.00గం॥లకు

నూతన వ్యవసాయ సంస్కరణలతో.. భూసారాన్ని పెంపొందించే దిశగా రైతులకు
లాభసాటి వ్యవసాయమే లక్ష్యంగా **శ్రీ కొండా నరేంద్ర** గారు
తంబళ్ళపల్లి - మదనపల్లిలో ఆర్గానిక్ హబ్‌గా, ఆంధ్రప్రదేశ్‌ను ఆర్గానిక్ రాష్ట్రంగా మార్చే
లక్ష్యం వైపు వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఆర్గానిక్ ఆంధ్ర - ఆరోగ్య ఆంధ్ర నిర్మాణంలో
ప్రముఖ ప్రాత పోషిస్తున్న **కొండా నరేంద్ర**

శ్రీ కొండా నరేంద్ర
పారిశ్రామిక వేత్త, వ్యవసాయ నిపుణులు
తంబళ్ళపల్లి నియోజకవర్గం